

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 11-05-2025 | సంపుటి - 24 సంచిక - 09 రూ : 4 | పేజీలు: 8

## బేషరతు కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సిద్ధం

- మిత్రపక్ష దేశాల సూచనతో రష్యాకు ప్రతిపాదన
- సోమవారం నుంచి కనీసం 30 రోజులు అమలు

**మే 10,** కీవ్: రష్యాతో పూర్తిస్థాయి, బేషరతు కాల్పుల విరమణకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఉక్రెయిన్, దాని మిత్రపక్ష దేశాలు శనివారం వెల్లడించాయి. సోమవారం నుంచి కనీసం 30 రోజులు కాల్పుల విరమణను పాటించేలా ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చాయి. నాలుగు ఐరోపా దేశాల నేతలు శనివారం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫ్రాన్స్, జర్మనీ, పోలండ్, బ్రిటన్ దేశాల అధినేతలు సమావేశమై చర్చలు జరిపారు. రష్యాతో

తరువాయి 2లో





## భారత్ సత్తా ప్రపంచానికి తెలిసింది

- వంద శాతం లక్ష్య ఛేదన
- గురితప్పకుండా దాడులు చేయటమే రుజువు
- విశ్రాంత ఎయిర్ మార్షల్ జొన్నలగెడ్డ చలపతి

మే 10 : 'ఆపరేషన్ సిందూర్'తో మన సైనిక సత్తా ప్రపంచానికి తెలిసిందని భారత వాయుసేన(ఐఏఎఫ్) సదరన్ ఎయిర్ కమాండ్ మాజీ కమాండర్ ఇన్ చీఫ్, విశ్రాంత ఎయిర్ మార్షల్ జొన్నలగెడ్డ చలపతి అన్నారు. ఎంచుకున్న లక్ష్యాలను వంద శాతం

తరువాయి 2లో

## అందాల పండగ..



- 72వ మిస్ వరల్డ్ పోటీలకు ఘనంగా శ్రీకారం
- ప్రపంచవ్యాప్తంగా 110 దేశాల నుంచి హాజరు
- వేడుకలను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 250 మంది కళాకారులతో కనులపండువగా పేరిణి నృత్యం
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా
- తెలంగాణ సాంస్కృతిక వైభవం కళ్లకు కట్టేలా ప్రదర్శనలు
- ర్యాంప్‌పై తళుక్కున మెరిసిన సుందరీమణులు

మే 10, హైదరాబాద్: అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రపంచ సుందరి పోటీలు శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం మిస్ వరల్డ్ 72వ పోటీల ఆరంభ వేడుకలకు వేదికైంది. తెలుగు రాష్ట్రాల

తరువాయి 2లో

## ముగ్గురు మిత్రుల ఆఖరి ప్రయాణం



- ఓఆర్ఆర్‌పై ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన కారు
- మంటలు చెలరేగి ఇద్దరు సజీవ దహనం.. చికిత్స పొందుతూ మరొకరి మృతి

**మే 10, హైదరాబాద్:** : కొత్త కారులో అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను చుట్టొద్దామని బయల్దేరిన స్నేహితుల ప్రయాణం విషాదాంతమైంది. ఆగి ఉన్న వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ముగ్గురు మరణించారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి తర్వాత రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ బహదూర్‌పుర హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన రితేశ్ అగర్వాల్ కుమారుడు దీపేశ్ అగర్వాల్(23). రితేశ్ ఇటీవల కొత్త కారు కొనగా దీపేశ్

తరువాయి 2లో

## దేశం కోసం ఏకమవుతాం




- ఉగ్రవాదంపై పోరులో అండగా నిలుస్తాం
- రాజ్‌భవన్‌లో సర్వమత సమావేశంలో తీర్మానం
- ఆపరేషన్ సిందూర్ మన బలాన్ని, బాధ్యతను చాటింది
- గవర్నర్ అబ్దుల్ నజీర్
- మన ప్రజలను ఇబ్బంది పెడితే సహించబోమని చాటాం
- సీఎం చంద్రబాబు ఉద్ఘాటన

2లో

## ఫలించిన అమెరికా దౌత్యం

- పోరు విరమణకు ఒప్పించామన్న ట్రంప్
- అగ్రరాజ్య మధ్యవర్తిత్వాన్ని ప్రస్తావించని భారత్!

**మే 10, ఢిల్లీ, ఇస్లామాబాద్:** భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతలను సడలించే విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మరికొన్ని దేశాలు చేపట్టిన దౌత్యం ఫలించింది. చైనా, సౌదీఅరేబియా, జి7

తరువాయి 2లో





## కాల్పుల విరమణ.. గంటల్లోనే పాక్ ఉల్లంఘన

- పోరును వీడేందుకు తొలుత రెండు దేశాల అంగీకారం
- డీజీఎంవోల స్థాయి చర్చల్లో నిర్ణయం
- అమెరికా సహా పలు దేశాల దౌత్య యత్నాలు సఫలం
- రాత్రి పొద్దుపోయాక పరిస్థితిలో కొంత మార్పు
- డ్రోన్లతో మళ్లీ దాడులకు తెగబడిన పాక్
- పంజాబ్, గుజరాత్, రాజస్థాన్, కశ్మీర్‌లలో బ్లాకౌట్ కొనసాగింపు
- విరమణకు ముందు పాకిస్థాన్‌లో 8 సైనిక స్థావరాల్ని ధ్వంసం చేసిన భారత్
- డ్రోన్లు, క్షిపణుల్ని విజయవంతంగా అడ్డుకున్న మన సైన్యం
- కశ్మీర్లో ఏడుగురి మృతి

2లో

## నేడు తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు

హైదరాబాద్: ఎప్‌సెట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్-ఫార్మసీ విభాగం ఫలితాలు ఆదివారం (11వ తేదీ) విడుదల కానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని

తరువాయి 2లో

# కాల్పుల విరమణ.. గంటల్లోనే పాక్ ఉల్లంఘన

ఢిల్లీ, శ్రీనగర్, జమ్మూ: భారత్, పాక్ ఉద్రిక్తతలు చల్లారినట్టే చల్లారి మళ్లీ వేడందుకున్నాయి. అమెరికా, మరికొన్ని దేశాల దౌత్యంతో.. రెండుదేశాల అంగీకారంతో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. ఈ మేరకు 'సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్' (డీజీఎంవో) స్థాయిలో రెండు దేశాల అధికారుల మధ్య చర్చలు ఫలించాయి. అయితే కాసేపటికే పాకిస్థాన్ మళ్లీ దాడులకు తెగబడింది. సరిహద్దులోని పలు ప్రాంతాలపైకి డ్రోన్లు ప్రయోగించింది. మన సైన్యం వాటిని సమర్థంగా నిలువరించింది. భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ.. సాయంత్రం 6 గంటల సమయంలో కాల్పుల విరమణపై ప్రకటన చేశారు. రెండు దేశాలు శాంతికి అంగీకరించాయని అంతకుముందే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామాజిక మాధ్యమ వేదికగా పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం.. భూతల, గగనతల, సాగరజలాల్లో అన్నిరకాల కాల్పులు, సైనిక చర్యలను రెండు దేశాలు నిలిపేస్తాయి. దీనికి పాకిస్థాన్ బేషరతుగా అంగీకరించిందని మిస్రీ తెలిపారు. 'రెండు దేశాల డీజీఎంవోలు శనివారం సాయంత్రం 3.35 గంటల సమయంలో నేరుగా మాట్లాడుకున్నారు. రెండువైపులా అన్నిరకాల సైనిక కార్యకలాపాలను నిలిపేయాలని నిర్ణయించారు. మళ్లీ వారు 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు చర్చలు జరుపుతారు' అని వివరించారు. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఎలాంటి ముందస్తు, తదుపరి షరతులు లేకుండా, ఇతర అంశాలతో ముడిపెట్టకుండా పాక్ అంగీకారం తెలిపిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. పాక్ విదేశాంగ మంత్రి ఇశాక్ దార్ కూడా కాల్పుల విరమణను ధ్రువీకరించారు. తాము ఎల్లప్పుడూ ఈ ప్రాంతంలో శాంతి, భద్రతను కోరుకుంటామని స్పష్టంచేశారు. కాల్పుల విరమణ అమల్లోకి రాగానే సరిహద్దులోని చాలా ప్రాంతాల్లో బ్లాకౌట్ ఎత్తేశారు.

**కొద్ది గంటల్లోనే మళ్లీ..**

శనివారం రాత్రి మళ్లీ కలకలం రేగింది. జమ్మూ కశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో పాకిస్థాన్ డ్రోన్లు కనిపించాయి. దీంతో గగనతల రక్షణ వ్యవస్థల్ని ఉపయోగించి, వాటిని కూల్చేశారు. శ్రీనగర్‌లో పలుచోట్ల పేలుళ్లు చోటుచేసుకున్నాయి. అఖ్నూర్, పింజార్, బారాముల్లా, అనంతనాగ్, బట్వాలాలో పాక్ డ్రోన్లను సైన్యం కూల్చేసింది. కాల్పులేమీ జరగలేదు. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చాక శ్రీనగర్‌లో పేలుడు శబ్దాలు వినిపించడంపట్ల ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్ చర్యను తీవ్రంగా ఖండించారు. పాక్ ఉల్లంఘనను కేంద్ర ప్రభుత్వం ధ్రువీకరించింది. ఇది అత్యంత దుర్మార్గమని మండిపడింది. దీనికి పూర్తిగా పాకిదే బాధ్యత అని, మన సైన్యం బాధ్యతాయుతంగా జవాబిస్తోందని పేర్కొంది. పాక్ కూడా పరిస్థితిని సమీక్షించి తగిన తీవ్రతతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికింది. ఇలాంటివాటిని బలంగా తిప్పికొట్టాలని మన సైన్యాన్ని ఆదేశించినట్లు తెలిపింది.

**బ్లాకౌట్ ఎత్తివేత.. మళ్లీ విధింపు**

కాల్పుల విరమణ ప్రకటన రాగానే పంజాబ్‌లో బ్లాకౌట్‌ను అధికారులు ఎత్తేశారు. ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘించినట్లు వార్తలు రాగానే దానిని తిరిగి విధించారు. గుజరాత్, కశ్మీర్, రాజస్థాన్‌లలో బ్లాకౌట్‌ను కొనసాగిస్తున్నారు. గుజరాత్‌లోని కచ్‌లోనూ డ్రోన్లు కనిపించాయి. కశ్మీర్‌లోని నగ్రోటా వద్ద చొరబాటుకు జరిగిన యత్నాన్ని కాల్పులతో సైన్యం వమ్ము చేసింది.

**8 సైనిక స్థావరాల ధ్వంసం**

శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాకిస్థాన్‌లోని 8 సైనిక స్థావరాలపై భారత్ శనివారం తెల్లవారుజామున విరుచుకుపడింది. రఫీక్, మురీద్, చక్లాలా, రహీంయార్ ఖాన్, సుక్కూర్, చునియన్, పస్రూర్, సియాల్‌కోట్ స్థావరాలపై మన యుద్ధ విమానాలు దాడులు చేశాయి. ఇందులో వైమానిక స్థావరాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్లు, రాడార్ సైట్లు, ఆయుధ నిల్వ కేంద్రాలున్నాయి. కచ్చితమైన లక్ష్యాలతో ఈ దాడులు చేశామని, పౌర నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ వెల్లడించారు. జమ్మూలోని నియంత్రణ రేఖకు ఆవలివైపు పాక్ సైనిక శిబిరాన్ని భారత దళాలు ధ్వంసం చేశాయి. సరిహద్దులు దాటేందుకు ఉగ్రవాదులు దీనిని లాంచ్‌ప్యాడ్‌గా వాడుకుంటున్నారు. దీంతోపాటు ట్యూబ్ డ్రోన్లను భారత్‌పై ప్రయోగించడానికి వీలుగా ఇక్కడ లాంచ్‌ప్యాడ్ ఉంది. దానిని కూడా భద్రతా దళాలు ధ్వంసం చేశాయి. భారత్ దాడులను పాక్ సైన్యం అధికార ప్రతినిధి షరీఫ్ చౌధరి ధ్రువీకరించారు. తాము వాటిని అడ్డుకున్నామని తెలిపారు. భారత్ దాడుల తీవ్రతను పెంచడంతో ప్రతీకార దాడులకు 'బున్యాన్ అల్ మార్సూస్' (ఉనుప గోడ) పేరుతో ఎదురుదాడి చేస్తున్నట్లు పాక్ తెలిపింది. మధ్యశ్రేణి ఫతే1 క్షిపణుల్ని ఉపయోగిస్తున్నట్లు వెల్లడించింది.

**పాక్ డ్రోన్లు, క్షిపణులు కూల్చివేత**

పాక్ కవ్వింపు చర్యలను శనివారం భారత్ విజయవంతంగా అడ్డుకుంది. డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, ఫైటర్ జెట్లతో జమ్మూ, పంజాబ్‌లలోని పౌర ఆవాసాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులకు ఆ దేశం ప్రయత్నించింది. మొత్తం 26 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంది. శ్రీనగర్, అవంతీపోరా, ఉధంపూర్‌లలోని వైమానిక స్థావరాల సమీపంలో మెడికేర్ సెంటర్, పాఠశాల లక్ష్యంగా దాడులు చేసింది. అర్ధరాత్రి దాటాక 1.40 గంటలకు పలు హైస్పీడ్ క్షిపణులతో పంజాబ్‌లోని వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడుల్లో మన స్థావరాల సమీపంలో స్వల్పనష్టం వాటిల్లిందని కల్నల్ సోఫియా ఖురేషీ తెలిపారు. దాడులను విజయవంతంగా తిప్పికొట్టామని స్పష్టం చేశారు.

## అందాల పండగ..

(మొదటిపేజీ తరువాయి)

చరిత్రలో ఈ పోటీలు నిర్వహించడం ఇదే ప్రప్రథమం. వేడుకలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 'హైదరాబాద్‌కు స్వాగతం, సుస్వాగతం' అంటూ నిర్వాహకులు అచ్చ తెలుగులో పలకరించారు. రామాచారి శిష్యబృందంలోని 50 మంది గాయనీగాయకులు అందెశ్రీ రచించిన రాష్ట్ర గేయం ''జయజయహే తెలంగాణ జననీ జయకేతనం'' ఆలపించారు. ప్రారంభ వేడుక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుగా సాగింది. ప్రపంచదేశాలకు మన కళల్ని అద్భుతంగా పరిచయం చేసింది.

### రౌండ్ల వారీగా వచ్చిన అందాల భామలు

తెలంగాణ జానపద నృత్యాలతో నాలుగు ఖండాలకు చెందిన పోటీదారులను పరిచయం చేయడం వీక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చింది. కొమ్ముకోయ కళాకారులు లాటిన్ అమెరికా దేశాల పోటీదారులకు ఆహ్వానం పలికారు. తొలుత అర్జెంటీనా కంటెస్టెంట్ ర్యాంప్‌పైకి వచ్చారు. అనంతరం గోండు తెగకు చెందిన గుస్సాడి నృత్యంతో ఆఫ్రికా ఖండంలోని దేశాల పోటీదారును ఆహ్వానించారు. లంబాడీడప్పులు ప్రదర్శన విదేశీయులను అమితంగా ఆకట్టుకుంది. వీరు యూరోపియన్ దేశ పోటీదారులకు స్వాగతం పలికారు. ఒగ్గుడోలు కళాకారుల వేషధారణ, ప్రదర్శన ఆకట్టుకుంది. జాతీయ జెండాను చేతబూని కళాకారులు అద్భుత ప్రదర్శన ఇచ్చారు. వీరు ఆసియా ఖండంలోని పోటీదారులను స్వాగతించారు.

### శాంతి, ఐక్యత సందేశం

సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా.. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకలు వైభవంగా, ప్రశాంతంగా జరిగాయి. 110 దేశాల అందాలభామలతోపాటు విదేశీ అతిథులకు తెలంగాణ ప్రభుత్వం మంచి ఆతిథ్యంతోపాటు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఈ వేడుకలను కోట్ల మంది తిలకించారు. ప్రపంచ శాంతికి, ఐక్యతకు మిస్ వరల్డ్ పోటీలు కూడా పాటుపడతాయని నిర్వాహకులు ప్రకటించారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజీని ఈ వేడుకలు మరోసారి ప్రపంచానికి చాటిచెప్పాయని పర్యాటకశాఖ వర్గాలు తెలిపాయి.

## ఫలించిన అమెరికా దౌత్యం

(మొదటిపేజీ తరువాయి)

దేశాలు కూడా తమవంతు పాత్ర పోషించాయి. రెండు దేశాల నాయకత్వాలతో రెండ్రోజులుగా ట్రంప్ మాట్లాడుతూ వచ్చి, కాల్పుల విరమణకు ఒప్పించారని అమెరికా ప్రకటించింది. వరసగా సాగించిన మధ్యవర్తిత్వ చర్చలతో తక్షణ, పూర్తిస్థాయి కాల్పుల విరమణకు ఇరు దేశాలూ అంగీకరించాయని 'ట్రూత్ సోషల్' ద్వారా ట్రంప్ ప్రకటించారు. ఇరుదేశాలూ వివేకాన్ని, జ్ఞానాన్ని ప్రదర్శించాయని అభినందించారు. పాక్ ఉప ప్రధాని ఇశాక్ డార్ కూడా 'ఎక్స్' వేదికగా ప్రకటన చేస్తూ కాల్పుల విరమణ వెంటనే అమల్లోకి వస్తుందన్నారు. సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతల్లో రాజీ పడకుండానే శాంతి, సుస్థిరతల కోసం తమ దేశం ప్రయత్నిస్తోందని చెప్పారు. శాంతి మార్గానికి అంగీకరించినందుకు రెండు దేశాలకూ కృతజ్ఞతలు చెబుతున్నట్లు అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ పేర్కొన్నారు. ట్రంప్ బృందం, ముఖ్యంగా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చేసిన కృషి ఎంతో ఉందని చెప్పారు. ట్రంప్ పోస్ట్ చేసిన కాసేపటికే రూబియో సైతం ప్రకటన చేశారు. భారత్, పాక్ ప్రధానులు, విదేశాంగ మంత్రులు, జాతీయ భద్రత సలహాదారులతో తాము మాట్లాడినట్లు చెప్పారు. అమెరికాకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంతీయంగా నెలకొన్న అంశాల పరిష్కారానికి ఇది నాంది పలుకుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. పాక్‌లోని వివిధ పార్టీల నేతలూ హర్షం వ్యక్తంచేశారు.

### శాంతిని కోరిన దేశాలు

భారత్, పాక్ సంయమనం పాటించాలని చైనా, సౌదీ అరేబియా, జి7 దేశాలు విజ్ఞప్తి చేశాయి. పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కూడా అంతర్గతంగా తమ దేశంపై ఒత్తిడి తీసుకువచ్చి, భారత్‌తో దౌత్యమార్గంలోనే ఉద్రిక్తత సడలించుకోవాలని తన సోదరుడు.. ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు పదేపదే సూచించారు. పాక్ సైన్యాధిపతి ఆసిం మునీర్‌తో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో ఫోన్లో మాట్లాడారు. సైనిక ఉద్రిక్తతలను తగ్గించడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌తోనూ రూబియో ఫోన్‌లో మాట్లాడారు. భారత్ ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఆచితూచి వ్యవహరించిందని, అదే తీరును కొనసాగిస్తుందని జైశంకర్ ఈ సందర్భంగా చెప్పారు. భారత్‌పాక్‌లు సంయమనం పాటించాలని జి7 దేశాలు తొలుత పిలుపునిచ్చాయి. పహల్గాం ఉగ్రదాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయా దేశాల విదేశాంగ మంత్రులు ప్రకటన విడుదల చేశారు.

## దేశం కోసం ఏకమవుతాం

(మొదటిపేజీ తరువాయి)

'దేశమే ముందు.. మతాలు వేరైనా దేశం విషయానికొస్తే మనమంతా ఒక్కటే. భిన్నత్వంలో ఏకత్వం అనేది భారతావని బలం. మతాల మధ్య చిచ్చుపెట్టి, దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు దాయాది దేశం సహా ఎవరు కుట్రలు చేసినా ఎదురొడ్డి తీరతాం. సాయుధ దళాలకు, కేంద్ర ప్రభుత్వానికి పూర్తి మద్దతుగా నిలుస్తాం, అంతా ఒక్కటై పని చేస్తాం' అని వివిధ మతాల పెద్దలు స్పష్టం చేశారు. దేశ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్నవేళ కేంద్రానికి, సాయుధ దళాలకు సంఘీభావం తెలిపేందుకు శనివారం గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షతన రాజ్‌భవన్‌లో సర్వమత సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉన్నతాధికారులు, వివిధ మతాల పెద్దలు పాల్గొన్నారు. దేశ రక్షణ, భవిష్యత్తు కోసం ప్రధాన మంత్రి, కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా తామంతా అండగా ఉంటామని తీర్మానించారు.

### అనవసర ఉద్రిక్తతను నివారించాం

'పహల్గాంలో 26 మంది పర్యాటకుల ప్రాణాలను తీసిన ఉగ్రవాదుల అనాగరిక చర్యను ప్రపంచమంతా ఖండించింది. ఆ దాడికి ప్రతిస్పందనగా పాకిస్థాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపైనే కచ్చితమైన దాడులు చేశాం' అని గవర్నర్ పేర్కొన్నారు. సాయుధ దళాలు ధైర్యం, వ్యూహాత్మకత, సంయమనంతో స్పందించాయని చెప్పారు. పాకిస్థాన్ సైనిక స్థావరాలు, మౌలిక సదుపాయాలపై ఎక్కడా భారత్ దాడి చేయలేదని గుర్తుచేశారు. అనవసర ఉద్రిక్తతను నివారించేలా, నిర్ణయాత్మకంగా 'ఆపరేషన్ సిందూర్'ను అమలు చేసిన విధానం మన బలాన్ని, బాధ్యతను ప్రదర్శించిందని ప్రశంసించారు. వీర జవాన్ల త్యాగాన్ని, అంకితభావాన్ని రాష్ట్ర ప్రజలు గౌరవిస్తున్నారని తెలిపారు.

### దేశం కోసం కలిసి నడవాలి

'సైద్ధాంతిక విభేదాలుండవచ్చు. కానీ, దేశం విషయానికొచ్చేసరికి కుల మతాలు, ప్రాంతాలకు అతీతంగా అందరూ ఏకమై అడుగు వేయాల్సిన బాధ్యత మనపై ఉంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'సరిహద్దుల్లో ఐదారు రోజులుగా నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నివారణలో త్రివిధ దళాలు వీరోచితంగా పోరాడాయి. దేశం కోసం పనిచేస్తా, చనిపోతే జాతీయ జెండా కప్పుకొనే చనిపోతానని పట్టుదలగా సైన్యంలో చేరిన మన తెలుగుబిడ్డ మురళీనాయక్.. పోరాటంలో వీరమరణం పొందాడు. భారత్ ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోదు. మన ప్రజలను ఇబ్బంది పెడితే మాత్రం ఉపేక్షించబోమని ఆపరేషన్ సిందూర్‌తో మరోసారి చాటాం' అని తెలిపారు.

### సంఘటిత శక్తిని చాటతాం

'మన సమైక్యతను దెబ్బతీయడానికే పహల్గాంలో ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లిం దేశాలు 55 ఉంటే భారత్‌లో ఉన్న స్వేచ్ఛా వాతావరణం ఎక్కడా లేదు. భారతీయులమని మాకు గర్వంగా ఉంది. మేమంతా దేశానికి మద్దతిస్తాం' అని సమావేశంలో పాల్గొన్న ముస్లిం మతపెద్దలు చెప్పారు. 'మతోన్మాదంతో దేశంలో అశాంతి, హింసను సృష్టిస్తూ అమాయకులను పొట్టనబెట్టుకునే ముష్కరులను హింసతోనైనా సరే ఎదుర్కోవాలి. మనలో విద్వేషాలు రెచ్చగొట్టి, విడగొట్టే ప్రయత్నం చేసినప్పుడు ధర్మయుద్ధం చేసి గెలవాలి' అని హిందూ మత పెద్ద అన్నారు. మన మత సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని కొనసాగించాలని, శాంతి కోసం అందరు దేవుళ్లనూ ప్రార్థిద్దామని క్రైస్తవ మత పెద్ద అన్నారు. సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికులకు అండగా మనమంతా జాతీయ రక్షణ నిధి (ఎన్‌డీఎఫ్)కి విరాళాలిద్దామని సిక్కు మతపెద్ద సూచించారు. విద్రోహ శక్తుల అంతు చూస్తున్న సైన్యానికి కులమతాలకు అతీతంగా మద్దతుగా ఉంటామని బౌద్ధ సమాజ ప్రతినిధి చెప్పారు. ఉగ్రవాద వ్యతిరేక పోరుపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేయొద్దని గుజరాతీ సమాజ్ ప్రతినిధి కోరారు.

## ముగ్గురు మిత్రుల ఆఖరి ప్రయాణం

(మొదటిపేజీ తరువాయి)

ముగ్గురు మిత్రుల ఆఖరి ప్రయాణం శుక్రవారం రాత్రి 11 గంటలకు దాన్ని తీసుకుని స్నేహితులను కలిసి వస్తానని చెప్పి వెళ్లాడు. కార్వాన్ విజయనగర్‌కాలనీకి చెందిన సంచయ్ మల్పానీ(22), ప్రగతినగర్‌కు చెందిన ప్రియాన్ష్ మిత్తల్(23)తో కలిసి కారులో శంషాబాద్ నుంచి అవుటర్ రింగ్ రోడ్డు మీదుగా ఘట్‌కేసర్ వైపు బయలుదేరాడు. అర్ధరాత్రి తర్వాత 2 గంటల సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధి గండిచెరువు వంతెన సమీపంలోని రాగానే నిలిపి ఉంచిన సరకుల వాహనాన్ని గుర్తించకుండా వేగంగా ఢీకొట్టారు. కారు ముందు భాగం చొచ్చుకెళ్లడంతో మంటలంటుకున్నాయి. సరకుల వాహన డ్రైవర్ రెండు వాహనాలను వేరు చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇతర వాహనదారులు కారులో మంటల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు విశ్వప్రయత్నం చేశారు. దీపేశ్ అగర్వాల్, సంచయ్ మల్పానీ మంటల్లో సజీవ దహనమయ్యారు.

## బేషరతు కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

మూడేళ్లకు పైగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించాల్సిన ఆవశ్యకతను వారు జెలెన్స్కీకి వివరించారు. ఉక్రెయిన్‌తో పాటు ఐరోపా దేశాల శాంతి, సుస్థిరతలకు ఇది అవసరమని పేర్కొన్నారు. సంధికి అంగీకరించి, శాంతి చర్చల ప్రక్రియ ప్రారంభమయ్యేలా రష్యాపైనా ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఈ మేరకు నాలుగు దేశాల నేతలు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఇదే విషయాన్ని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సిబిహా కూడా నిర్ధారించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్లో జెలెన్స్కీ, నాలుగు ఐరోపా దేశాల నేతలు మాట్లాడిన తర్వాతే కాల్పుల విరమణ ప్రతిపాదన చేసినట్లు ఆండ్రీ వెల్లడించారు. అంతకుముందు... రెండో ప్రపంచ యుద్ధం ముగిసి 80 ఏళ్లు అయిన సందర్భంగా కీవ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉక్రెయిన్ అధ్యక్షుడితో కలిసి ఫ్రాన్స్, జర్మనీ, పోలండ్, బ్రిటన్ నేతలు పాల్గొన్నారు.

## భారత్ సత్తా ప్రపంచానికి తెలిసింది

(మొదటిపేజీ తరువాయి)

గురితప్పకుండా పేల్చివేయటం భారత సైన్యానికే సాధ్యమైందన్నారు. దాడులకు ఎంచుకున్న లక్ష్యాన్ని విమానాలను గాని, సైనికులను గాని నష్టపోకుండా నూటికి నూరు శాతం సాధించటం ద్వారా సైన్యం తన సత్తాను నిరూపించుకుందని చెప్పారు. తక్కువ సమయంలో మనం అనుకున్నది సాధించినట్లు తెలిపారు. జొన్నలగెడ్డ చలపతి ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా, టెస్ట్ పైలట్‌గా విధులు నిర్వహించారు. రఫేల్, తేజస్ యుద్ధ విమానాలపై అవగాహన ఉంది. శ్రీనగర్, అవంతీపోరా, పఠాన్‌కోట్, అమృత్‌సర్, ఆదంపూర్, అంబాలా, బఠిండా తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు, తాజాగా కాల్పుల విరమణకు అవగాహన కుదరటంపై, ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులోని ముఖ్యాంశాలు...

*** పాకిస్థాన్ విషయంలో మన దేశం ఈసారి ఎందుకు కఠిన వైఖరి అవలంబించింది ?**

జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన 370 అధికరణాన్ని రద్దు చేసిన తర్వాత అక్కడ ఎంతో సానుకూలమైన పరిస్థితులు నెలకొన్నాయి. బాగా అభివృద్ధి జరుగుతోంది. ఉపాధి, ఉద్యోగావకాశాలు పెరిగాయి. పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. మూడేళ్లలో 7.5 కోట్ల మంది సందర్శించారు. కానీ, పహల్గాం ఉదంతంతో మొత్తం మారిపోయింది. ఈ ఘటన దేశ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పక తప్పని పరిస్థితి ఎదురైంది. ప్రభుత్వం అదే చేసింది. ఉగ్రవాదులను మన దేశం మీదకు ఉసిగొల్పితే ఉపేక్షించే ప్రసక్తే లేదనే విషయాన్ని పొరుగు దేశానికి స్పష్టంగా చెప్పటమే మన ప్రధాన లక్ష్యం. మరోసారి పహల్గాం లాంటి ఉదంతాలకు పాల్పడాలంటే భయపడే పరిస్థితి కల్పించాలని భారత్ భావిస్తోంది. అందుకే ఈసారి మరింత కఠినంగా వ్యవహరించింది. వాస్తవానికి మనం చేసిన దాడుల కంటే సింధూ జలాల ఒప్పందం నుంచి వైదొలగటం వల్ల పాకిస్థాన్‌కు ఎక్కువ నష్టం జరుగుతుంది.

*** చైనా ఇచ్చిన జే-10సి జెట్లతో మన రఫేల్ యుద్ధ విమానాలను కూల్చినట్లు పాకిస్థాన్ ప్రకటించుకుంది. ఇందులో నిజమెంత ?**

ఏమాత్రం వాస్తవం కాదు. మీటియోర్ క్షిపణితో కూడిన రఫేల్ యుద్ధవిమానం అత్యంత ప్రమాదకరమైంది. దీని ముందు జే10సి వంటి ఒక తరం పురాతనమైన విమానాలు నిలవలేవు. సాంకేతికపరంగా, ఇతర అంశాల్లో రెండింటికీ పోలికే లేదు. మూడు రఫేల్ ఫైటర్లను కూల్చివేసినట్లు పొరుగు దేశం తప్పుడు ప్రచారం చేసుకుంటోంది.

*** తేజస్, ఏఎంసీఏ (అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్) వంటి స్వతంత్ర రక్షణ ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటి.. ఈ ప్రాజెక్టులు వేగం పుంజుకుంటాయా ?**

రక్షణ రంగంలో స్వావలంబనకు కేంద్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా చర్యలు తీసుకుంటోంది. తేజస్, ఏఎంసీఏ తదితర ప్రాజెక్టులకు పెద్దఎత్తున మద్దతు ఇస్తోంది. నిధులకు, ఆర్డర్లకు కొరత లేదు. ఒక రకంగా రక్షణరంగ సంస్థలకు ఇది స్వర్ణయుగం. అయితే, అందివచ్చిన అవకాశాన్ని ఈ సంస్థలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవటం లేదు. ఆర్డర్లను సత్వరం పూర్తి చేయడం లేదు. తేజస్ యుద్ధ విమానాల డెలివరీ ఎంతో ఆలస్యం అవుతోందని, ఇందులో ప్రైవేటు సంస్థలకు పాత్ర కల్పించటం మేలని ఇటీవల భారత వాయుసేన అధిపతి వ్యాఖ్యానించడం గమనార్హం. దీన్ని రక్షణ సంస్థలు గుర్తించాలి. ప్రాజెక్టులను నిర్దేశిత కాలంలో పూర్తి చేయటం ద్వారా దేశభద్రతలో భాగం కావాలి.

**ఈ మొత్తం వ్యవహారంలో చైనా పాత్ర ఏమిటి ?**

చైనా నుంచి మద్దతు ఉంటుందని పాకిస్థాన్ విశ్వసించింది. కానీ, ఆర్థికపరమైన అంశాల వల్ల ఈసారి చైనా పెద్దగా స్పందించలేదు. యూఎస్‌చైనా మధ్య 'ట్రేడ్ వార్' దీనికొక కారణం. అధిక పన్నుల వల్ల యూఎస్ మార్కెట్‌ను కోల్పోతే ఆర్థికంగా బాగా నష్టపోతుంది. ప్రత్యామ్నాయంగా భారత్ వంటి పెద్దదేశం కావాలి.

**పాకిస్థాన్ మళ్లీ కవ్వింపు చర్యలకు పాల్పడితే ఎలా స్పందించాలి ?**

మన సైన్యం చేసిన దాడుల్లో ఆ దేశ రక్షణ, కమ్యూనికేషన్ల వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. పాకిస్థాన్ బలహీనతలపై మనకూ అవగాహన వచ్చింది. వాళ్లు ఏం చేస్తున్నారో గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం కలిగింది. అంతేకాకుండా పహల్గాం ఉదంతానికి మన దేశం దీటుగా స్పందించటం వల్ల దేశ ప్రజల్లో విశ్వాసం, ధైర్యం ఏర్పడింది. జమ్మూకశ్మీర్‌ను సందర్శించటానికి భయపడాల్సిన అవసరం లేదనే నమ్మకం కలిగింది. కొద్ది రోజుల్లో గతంలో కంటే ఎంతో అధిక సంఖ్యలో జమ్మూకశ్మీర్‌కు పర్యాటకులు పోటెత్తటం ఖాయం. ప్రజలు అలాంటి సందేశం ఇవ్వాల్సిన అవసరం కూడా ఉంది.

*** భారత్, పాకిస్థాన్ వాయుసేన మధ్య సాంకేతిక సత్తా, నైపుణ్యాల విషయంలో ఎవరిది పైచేయి ?**

రెండు దేశాల మధ్య పోలికే లేదు. భారత వాయుసేనకు పాకిస్థాన్ ఎదురు నిలవలేదు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆ దేశంపై మన దేశం దాడికి దిగుతుందనేది అందరికీ తెలిసిపోయింది. పాకిస్థాన్ సైన్యం అన్ని రకాలుగా సన్నద్ధమైంది. అయినా ఎంచుకున్న ప్రదేశాల్లో భారత సైన్యం విజయవంతంగా దాడులు నిర్వహించింది. వంద శాతం లక్ష్యాన్ని సాధించింది. సాధారణంగా క్షిపణులు, శతఘ్నులు ప్రయోగించినప్పుడు కొన్నిసార్లు లక్ష్యానికి కాస్త అటూఇటూ తాకుతాయి. ప్రస్తుత దాడుల్లో నిర్దేశించిన లక్ష్యాన్ని భారత వాయుసేన నూరు శాతం సాధించింది. పొరుగు దేశంలో ఎక్కడైనా, దేన్నైనా మనం ధ్వంసం చేయగలమని.. ఇందుకు అణ్వస్త్రాలు అవసరం లేదని, సంప్రదాయ ఆయుధాలతోనే చేయగలమని రుజువు చేశాం. ఇది పొరుగు దేశానికి గుణపాఠం లాంటిది. మన దాడులను అడ్డుకోలేకపోయారు.

## నేడు తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు

తన నివాసంలో ఫలితాలను విడుదల చేయనున్నారు. ఏప్రిల్ 29, 30 తేదీల్లో జరిగిన ఎప్సెట్ అగ్రికల్చర్ విభాగంలో 81,198 మంది, మే 2, 3, 4 తేదీల్లో నిర్వహించిన ఇంజినీరింగ్ విభాగానికి 2,07,190 మంది హాజరయ్యారు.

# ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచదేశాలు ఏకమై పోరాటం చేయాలి

*** మాజీ మంత్రి హరీష్ రావు**





కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి): ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచదేశాలు ఏకమై పోరాటం చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం లోని "మల్లారెడ్డి హెల్త్ సిటీ" వారి అధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ కు సంఘీభావంగా జాతీయ సమగ్రతను చాటుతూ నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు , బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ , ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా జమ్మూ కాశ్మీర్ లో వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీ నాయక్ కు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అమాయకులను చంపడం అనేది ఉగ్రవాద, ఉన్మాదానికి నిదర్శనమన్నారు. బిన్ లాడెన్ వంటి ఉగ్రవాదులను పెంచి పోషించి ప్రపంచ మానవాళికే పాకిస్తాన్ దేశం ప్రమాదకరంగా మారిందన్నారు. ఇప్పటికే నాలుగు సార్లు పాకిస్థాన్ భారత్ తో యుద్ధానికి కాలు దువ్విందని, కానీ భారత సైన్యం దాటికి నిలవలేక పోయిందన్నారు, అయినా ఇంకా బుద్ధి రాలేదని, ప్రజాస్వామ్యంలో పాకిస్తాన్ కి విలువలేదని, ఆ దేశ ప్రజలే పాకిస్తాన్ ఆర్మీ, ఉగ్రవాదాన్ని తన్నే దుస్థితికి పాకిస్తాన్ దిగజారిందన్నారు. భారత సైన్యం అద్భుత ధైర్యసాహసాలతో పాకిస్తాన్ వణికిపోతుందని, ఈ యుద్ధంలో భారత సైన్యానికి వెన్నుదన్నుగా నిలవాల్సిన బాధ్యత ప్రతీ భారతీయుడిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, బిఆర్ఎస్ నాయకులు, అభిమానులు, మల్లారెడ్డి హెల్త్ సిటీ యాజమాన్యం ప్రీతిరెడ్డి, ప్రొఫెసర్లు, డాక్టర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పివి రావు ఆశయ సాధనకు కృషి చేయాలి

**- ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ**

**- జువ్వి నరసింహ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మాల మహానాడు వ్యవస్థాపకుడు స్వర్గీయ పివి రావు ఆశయ సాధనకు మాలలు కృషి చేయాలని మాల మహానాడు చౌటుప్పల్ మండల అధ్యక్షుడు జువ్వి నరసింహ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో మాల మహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో పివి రావు 73వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణ జాతీయ రహదారిపై పివి రావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళుర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జువ్వి నరసింహ మాట్లాడుతూ మాలల అభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప నేత పీవీ రావు అని కొనియాడారు. రాజ్యాంగ విరుద్ధంగా అప్పటి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తే, పివి రావు నాయకత్వంలో అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. మాలల సంక్షేమం కోసమే పీవీ రావు ప్రాణత్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల ప్రధాన కార్యదర్శి సంగం నర్సింగరావు, నాయకులు జువ్వి రఘుపతి, కట్ట శంకరయ్య, గోలి స్వామి, నామ బాలరాజు, జువ్వి శివ, వల్లబోతు భాస్కర్, సుంకరి హరినాథ్, మనే కుమార స్వామి, నామ సురేష్, ఈసం మహేష్, అనమల యాదయ్య, కట్ట అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ప్రధాన కార్యాలయం సందర్శించి డైరెక్టర్ (పా)తో సమీక్ష



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నల్ల బంగారం వెలికితీస్తూ..శ్రమిస్తున్న సింగరేణి కార్మికులకు అండగా నిలుస్తామని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి అభయమిచ్చారు. శనివారం కొత్తగూడెం లోని సింగరేణి ప్రధాన కార్యాలయానికి వెళ్లి.. ఆ సంస్థ డైరెక్టర్ (పా) కే. వెంకటేశ్వర్లు, జీఎం, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో వైద్యుల కొరత లేకుండా చూడాలని, కార్మికులకు విధి నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వ పరంగా సింగరేణికి పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు, ఐఎన్టీయూసీ నాయకులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ని కలిసిన బిఎస్ ఎన్ కిరణ్ యాదవ్

శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి: కూకట్ పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు ను శనివారం శేరిలింగంపల్లి బిఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం రాజకీయ పరిస్థితులపై కృష్ణారావు ఆరా తీశారు. శేరిలింగంపల్లి బిఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని ఆయన తెలిపారు. ఆరడుగుల కృష్ణారావు విగ్రహాన్ని బిఆర్ఎస్ మియాపూర్ అధ్యక్షులు బిఎస్ఎన్ కిరణ్ యాదవ్ బహూకరించారు.ఈ కార్యక్రమంలో కిరణ్ యాదవ్ తో పాటు బిఆర్ఎస్ నాయకులు జహంగీర్, గంగాధర్, బిఆర్ఎస్వీ శేర్లిలింగంపల్లి రాజు యములవలస ,రోహిత్, జస్వంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్యకు ఘన సన్మానం




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నూతనంగా ఎన్నికైన ఉబ్బు వెంకటయ్యను శనివారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ నూతన పాలకవర్గానికి స్వీట్లు తినిపించారు. నూతన పాలకవర్గ సభ్యులకు ఎమ్మార్పీఎస్ తరపున ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొడ్డు శ్రవణ్ కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గుడ్డేటి యాదయ్య, బక్క శ్రీనాథ్, కొయ్యలగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేడి యాదయ్య, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు బోయ రాము, ఎమ్మార్పీఎస్ నాయకులు తూర్పింటి యాదయ్య, చింతల సాయిలు, లందగిరి భీమయ్య, ఆరుట్ల లింగస్వామి, ఎమ్మార్పీఎస్ మున్సిపల్ అధ్యకుడు ఎర్ర శంకర్, చీమకండ్ల శ్రీనివాస్, ఎర్ర గౌతమ్, దొనకొండ కృష్ణ, చెంచల శ్రీనివాస్, గ్యార సుధాకర్, ఊదరి యాదయ్య, బొడ్డు పరమేష్, ఊదరి నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్ ని ఎంపీ రఘురామిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు నతనడక నడుస్తున్నాయని త్వరగా పూర్తి చేయాలని ఎంపీ రఘురామిరెడ్డి అన్నారు. శనివారం ఆయన కొత్తగూడెం రైల్వే స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకి , రైల్వే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా రైల్వే స్టేషన్ లో అన్ని రకాల సౌకర్యాలతో రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చారు. కరోనాలో రద్దు చేసినటువంటి రైళ్లు అన్నింటిని తక్షణం పునరుద్ధరణ చేయాలన్నారు. కోవూరు రైల్వే లైన్ పనులు, డోర్నకల్ టు కొత్తగూడెం వరకు నడుస్తున్న డబ్లింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్లో మూడవ ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేయాలన్నారు. కాకతీయ ట్రైన్ మణుగూరు వరకు పొడిగించి నడిపించాలన్నారు. కొత్తగూడెం నుండి తిరుపతికి , శిరిడీకి ప్రత్యేక రైలు నడపాలని, తదితర రైల్వే సమస్యలను సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మేనేజర్ తో ఫోన్లో మాట్లాడి త్వరగా రైల్వే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, ఆళ్ళ మురళి, ఊకంటి గోపాలరావు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు డి ఆర్ యు సి సి మెంబర్ వైస్ శ్రీనివాసరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, ఐఎన్టీయూసీ నాయకులు రజాక్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు విజయ భాయ్, హైమావతి, కేకే శ్రీనివాస్, రావి రాంబాబు, తలువు అనిల్, జయప్రకాష్, బాల ప్రసాద్, సాయి, కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ నాయకులు తైతాలు పాల్గొన్నారు.

## వివాహానికి హాజరుకావాలని ప్రభుత్వ విప్ కు ఆహ్వానం



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజాపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్దోళ్ల ప్రభాకర్ వరలక్ష్మి ల కూతురు హారిక వివాహం ఈనెల 21వ, తేదీన జరుగుతుండగా హాజరు కావాలని కోరుతూ శనివారం దంపతులు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. తప్పకుండా హాజరవుతానని ఆయన హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, మండల సీనియర్ నాయకులు మేడిశెట్టి సురేష్ తదితరులున్నారు.

## ఘనంగా బీజేపీ జిల్లా కార్యదర్శి కాదురి అచ్చయ్య జన్మదిన వేడుకలు

యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : బీజేపీ జిల్లా కార్యదర్శి కాదురి అచ్చయ్య జన్మదిన వేడుకలు శనివారం పట్టణ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. దీనికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్ హజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ బిజెపికి బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తూ ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్నటువంటి కాదూరి అచ్చయ్య ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని కోరుకుంటూ అలాగే వచ్చే ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలనేది కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కొత్త కార్యకర్తలను కండువా కప్పి పార్టీ లోకిఆహ్వానించారు .ఈ కార్యక్రమంలో స్టేట్స్ కౌన్సిల్ నెంబర్ రచ్చ శ్రీనివాస్.పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ కుమార్, మండల మాజీ అధ్యక్షులు సత్యం ,అశోక్, లెంకలపల్లి శ్రీను ,ఆలేటి కర్ణ ,ప్రభాకర్ ,బుచ్చిబాబు ,వంశీ ,భాను ,అజయ్ ,మహేశ్వర్, చింటూ ,సురేష్ ,వినోద్ ,గణేష్ చారి రుద్రాక్ష నవీన్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆపద కాలంలో ఆర్మీకి అండగా బీర్ల అయిలయ్య కుమారుడు బీర్ల శివమణి

*** కిడ్డి బ్యాంకు నుండి లక్ష రూపాయలను భారత ఆర్మీకి అందజేస్తున్న బీర్ల అయిలయ్య ,కుమారుడు బీర్ల శివమణి**




యాదగిరిగుట్ట , ప్రజా స్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోనీ ప్రభుత్వ విప్ కార్యాలయంలో ఆలేరు నియోజకవర్గం లోని ఎనిమిది మండలాల లబ్ధిదారులకు 236 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పంపిణీ చేశారు.అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టడం కోసం భారత ఆర్మీ చేస్తున్న పోరాటానికి నా తనయుడు బీర్ల శివమణి తన కిడ్డి బ్యాంక్ లో దాచుకున్న లక్ష రూపాయలను అందజేస్తున్నట్లు తెలిపారు. దాంతో పాటు బీర్ల ఫౌండేషన్ నుండి అలాగే తన నెల జీతం నుండి కూడా ఆర్మీకి రక్షణ శాఖ తరపున యాదాద్రి భువనగిరి కలెక్టర్ కి డబ్బులను అందజేస్తున్నట్లు తెలిపారు. భారత్ దేశంలో ,రాష్ట్రంలో మంచి పరిపాలన, కులమతాలకు అతీతంగా కొనసాగుతున్న తరుణంలో పాకిస్థాన్ ముష్కరులు పహల్గాంలో పర్యాటకులను దాడి చేయడం చాలా బాధాకరమన్నారు. ఈ విషయంలో భారత దేశం ప్రభుత్వం ఉగ్రవాదులను మట్టుబెట్టడం కోసం చర్యలు చెప్పడం స్వాగతిస్తున్నామన్నారు. మా ప్రాణాల కోసం పోరాటం చేస్తున్న ఆర్మీ జావానులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,ఆలేరు నియోజకవర్గం ప్రజల తరపున ధైర్యంగా పోరాటం చేయడం కోసం అండగా వుంటున్నామని అన్నారు. ఆర్మీ జావానులు మంచి ఆరోగ్యం తో ఉండాలని దేవుడిని వేడుకుంటునట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలు కోసం సన్నబియ్యం అందిస్తున్నారని. ఆలేరు ని అన్ని రకాలుగా అగ్రగామిగా నిలపెట్టడం కోసం,అన్ని చెరువులు నింపటం జరిగిదన్నారు. ఈ పోరాటం లో మరణించిన జవానులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నామన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు

# ప్రజలకు చేరువ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

*** ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు.**








ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం లో సుమారు రూ.37.64 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 33 కెవి విద్యుత్ ఉప కేంద్రాల శంకుస్థాపన అనంతరం అశ్వరావుపేట నియోజకవర్గం జిల్లా అధికారులతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార , పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి ,అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, వైరా శాసనసభ్యులు రామదాస్ నాయక్ , జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐ టిడిఏ పి ఓ రాహుల్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు కమలాపురం సబ్ , అంకంపాలెం లో 130 కె వి సబ్ స్టేషన్ కూడా మంజూరు చేస్తే అశ్వరావుపేట నియోజకవర్గంలో విద్యుత్ కు ఎటువంటి అంతరాయం ఉండదని విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు అనువైన స్థలం కూడా ఉన్నదని అధికారులు వివరించారు దానికి గాను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పందించి వెంటనే సబ్ స్టేషన్ల ఏర్పాటు అశ్వరావుపేట నియోజకవర్గం లో డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయం ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని సీఎండీని ఆదేశించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన గిరిజనులు అధికంగా నివసించే ఈ అశ్వరావుపేట నియోజకవర్గం అభివృద్ధికి కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని దానిని అధికారులు క్షేత్రస్థాయిలో ప్రతి కుటుంబానికి తీసుకు వెళ్ళగలిగితే ప్రభుత్వం విజయం సాధించినట్టే అన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి చేపడుతున్న ప్రతి సంక్షేమ పథకాన్ని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లే బాధ్యత ప్రతి అధికారి మీద ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకువెళ్లడంలో నిర్లక్ష్యం వహిస్తే ఎటువంటి మొహమాటలు లేకుండా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు. మూడున్నర కోట్ల మంది ప్రజలకు హామీలు ఇచ్చి ప్రభుత్వం ఏర్పడిందని వాళ్ల నమ్మకాన్ని వాళ్ళ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. ఉద్యోగస్తుల సమస్యలను కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆలోచనలో ఉందని, ఉద్యోగస్తుల సమస్యలను కూడా కొద్ది రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. అధికారుల భాగస్వామ్యంతోనే పాలన ప్రజలకు అందించాలని, ప్రజలకు అందించ లేనప్పుడు ప్రజాస్వామ్యానికి అర్థం లేకుండా పోతుంది కాబట్టి బలమైన ప్రజాస్వామ్య రాష్ట్రంగా బాగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా దేశంలోనే రైజింగ్ తెలంగాణ రాష్ట్రంగా తెలంగాణ మోడల్ గా ఈరోజు దేశం మన వైపు చూస్తున్న క్రమంలో ప్రభుత్వంతో పాటు అధికారుల కు కూడా విజయాలలో భాగస్వామ్యం ఉంటుందన్నారు.

*** ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు అయింది:మంత్రి పొంగులేటి**

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు అయింది కానీ ఇంకా ప్రభుత్వ అధికారులు ప్రభుత్వం యొక్క ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే పూర్తి దిశలోకి రాలేదని, రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వ ఆలోచనను సామాన్య ప్రజలకు,గిరిజన ప్రాంతాల అభివృద్ధి చేయడానికి అధికారులు దృష్టి సారించాలన్నారు. ఇరిగేషన్ సంబంధించి ఏవైతే గతంలో డ్యామేజ్ అయిన ట్యాంకులు మరియు నూతనంగా మంజూరైన పనులు ఈ సీజన్లో పూర్తి చేసి రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో గిరిజన ప్రాంతంలో వైద్య సేవలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి మరియు ఐటిడిఏ మూడు శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సన్న బియ్యం పథకం అమలులో భాగంగా అర్హులైన వాళ్లకి ఇప్పటికే సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని ఇంకా మిగిలిన వారిని కూడా గుర్తించి రేషన్ కార్డులు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక ఆలోచనతో రూపొందించిన రాజీవ్ యువ వికాసం లో భాగంగా నియోజకవర్గానికి 4500 మందికి ఒక్కొక్కరికి 5 లక్షలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి, మంత్రులు , శాసనసభ్యులు పూర్తి సహకారం అందిస్తారని, ప్రభుత్వ ఆలోచనలను క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లే ప్రధానమైన పాత్ర అధికారులు బాధ్యతాయుతమైన ఉద్యోగస్తులపైనే ఉందని మంత్రి తెలిపారు. నియోజకవర్గాల అభివృద్ధి కొరకు అధికారులు స్థానిక శాసనసభ్యుల సూచనలు తీసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కాలనీలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

*** అధికారులకు సూచించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జలమండలి అధికారులకు సూచించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ , జయశంకర్ కాలనీ లో డ్రైనేజ్ , రోడ్లకు సంబంధించి సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ శనివారం జయశంకర్ కాలనీ లో పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జయశంకర్ కాలనీ లో ఇటీవలే డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని , సీసీ రోడ్డు త్వరలో మంజూరు చేసి నిర్మిస్తామని అన్నారు. కాలనీ లో కొన్ని బ్లాక్ లకు త్రాగు నీరు ప్రెజర్ రావడం లేదని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీ లోని త్రాగు నీటి సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, పోశెట్టిగౌడ్, మల్లేష్, ఫారూఖ్, బాబురావు, బాగులు, మోజెస్, బాలకృష్ణ, సలీమ్, రాజమని తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ ప్రెసిడెంట్ సామ్రాజ్యలక్ష్మి (రాధా) ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి , సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ "కనులు తెరిచిన క్షణం నుంచి.. బంధం కోసం బాధ్యత కోసం.. కుటుంబం కోసం.. అందర్నీ కనుపాపలా తలచి, ఆత్మీయత పంచి, తనవారి కోసం అహర్నిశలు కష్టించి, వారిని సహించి, వారి భవిష్యత్తు గురించి, తన ఇంటిని నందనవనం చేసే అమ్మకు... పాదాభివందనం అని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఆంధ్ర ప్రదేశ్ లో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది

*** టీయూడబ్ల్యూజే (ఐజేయు) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్**

కూకట్పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆంధ్ర ప్రదేశ్ లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, అందుకు సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి పై అక్రమ సోధాలు చేయడమే అని తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఎలాంటి నోటీసులు లేకుండా "సాక్షి" దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయ్ రెడ్డి ఇంటికి వెళ్లి సోదాలు చేయడాన్ని నిరసిస్తూ శనివారం కెపిహెచ్బి కాలనీలోని జాతిపిత మహాత్మ గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్ట్ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఎలాంటి నోటీసులు లేకుండా "సాక్షి" దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయ్ రెడ్డి ఇంటికి వెళ్లి సోదాలు చేయడాన్ని కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించకుండా ప్రభుత్వాలే బాధ్యతగా ఉండాలని, కక్షపూరితంగా దాడి చేయడం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం తీరుకు ప్రజలను, జర్నలిస్ట్ లను చైతన్యపరిచి మరో ఉద్యమం చేసి జర్నలిస్టుల సంఘాల హక్కులను కాపాడుకుంటామని ఐ జేయు నాయకుడు, ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు విద్యా వెంకట్ అన్నారు.

*** ప్రశ్నించే గొంతును నొక్కి పెట్టేస్తారా..?**

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతును నొక్కి పెట్టేస్తారా అని సాక్షి దినపత్రిక కూకట్ పల్లి జోన్ ఇంచార్జ్ పరమేశ్ అన్నారు. ఇసుక, లిక్కర్, మైనింగ్, స్కాం లు, రైతులకు మద్దతు ధర కల్పించకపోవడం ఇలా ప్రభుత్వ వరుస వైఫల్యాలను ఎండగడుతున్న సాక్షి గొంతు నొక్కాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి నోటీసులు లేకుండా పోలీసులు ఇంట్లోకి చొరబడి సోదాలు చేయడం, భయపెట్టడం సాక్షి గొంతు నొక్కే ప్రయత్నం అని అన్నారు.

*** రాజకీయ కక్ష సాధింపు లో జర్నలిస్టుల ఇంటిపై దాడిని**




**ఖండిస్తున్నాం..**

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు అందరికీ ఉందని దానిని నొక్కిపెట్టకూడదని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా జర్నలిస్టుల ఇంటిపై పోలీసులు వెళ్లడం ఖండిస్తున్నామని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని, లేదంటే విద్యార్థి సంఘాలు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు దయ సాగర్, శ్రీనివాస్ గౌడ్, మాణిక్ రెడ్డి, రాహుల్, నాగరాజు, ప్రవీణ్, సాగర్ రెడ్డి, మారుతి సాగర్, రామ్, నవీన్, రమేష్, నరసింహ రావు, వెంకటేష్, రామారావు, పలు పార్టీ ల నాయకులు ఐస్ క్రీమ్ వెంకట్ రెడ్డి, శివా రెడ్డి, జొన్నల శ్రీనివాస్ రెడ్డి, వెంకటస్వామి రెడ్డి, విద్యార్థి సంఘాల నాయకులు దిలీఫ్, అశోక్ గౌడ్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# పాకిస్తాన్ ఉగ్రవాదం రెండు ఒకటే....

*** కడుపుకు తిండి లేని వారు కాశ్మీర్ కోసం పోరాటం అవివేకం**

*** భారత సైన్యం ఎప్పుడూ ధర్మ యుద్ధమే చేస్తుంది**

*** మీడియాతో రాజపేట మండల జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఉప్పల రమేష్**

రాజాపేట, ప్రజా స్ఫూర్తి : ఉగ్రవాదుల కాల్పులలో మరణించిన కుటుంబ సభ్యుల మహిళల మౌనం చూసిన పాకిస్తాన్ వారు, భారత మహిళల నాయకత్వంలో ఉగ్రరూపం చూస్తున్నారని, ఉగ్రవాదం పాకిస్తాన్ రెండూ వేర్వేరు కాదని రాజపేట మండల జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షులు ఉప్పల రమేష్ అన్నారు. శనివారం రాజపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భారతదేశ భారత సైన్యం ఎల్లప్పుడూ ధర్మ యుద్ధమే చేస్తుందని, భారతీయులు మంచోళ్లే కానీ చేతకాని వారు కాదని మరోసారి పాకిస్థాన్ కు, ప్రపంచ దేశాలకు అర్థమైందన్నారు. కడుపుకు తిండి లేని పరిస్థితుల్లో ఉన్న పాకిస్తాన్ ఉగ్రవాదం పెంచి పోషిస్తూ కాశ్మీర్ కోసం భారతదేశంతో కయ్యానికి కాలు దువ్వడం సిగ్గుమాలిన చర్య అన్నారు. భారతీయులంతా ఒకటేనని చాటి చెబుతూ భారత సైన్యానికి సంఘీభావం తెలుపుతూ మందిరము, మసీదు, చర్చలలో భారత ప్రజలందరూ ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేయాలని పాకిస్తాన్ కు ఇదే చివరి యుద్ధముగా జవాబు చెప్పాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. భారత సైన్యం ప్రాణాలొడ్డి పోరాడుతున్న విషయం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, భారత జవాన్లు కనిపించే ముక్కోటి దేవతలు, అల్లా, జీసస్ లు అన్నారు. జవాన్లు కన్న తల్లిదండ్రులు ఎంతో గొప్ప వారిని కొనియాడారు. వీరమరణం పొందిన భారత జవాన్లకు ఈ సందర్భంగా ఉప్పల రమేష్ జోహార్లు పలికారు.

# డబుల్ బెడ్ రూం సముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

*** కోలన్ హనుమంత్ రెడ్డి కి వినతి**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : డబుల్ బెడ్ రూం సముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని శనివారం డబల్ బెడ్ రూమ్స్ వాసులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డబల్ బెడ్ రూమ్స్ వాసులు మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కార్యాలయంలో గండిమైసమ్మ మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న డబల్ బెడ్ రూమ్స్ సముదాయంలో కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే సముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించి వారి ఇబ్బందుల పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డబల్ బెడ్ రూమ్స్ వాసులు హనుమంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేసారు.



## యుద్ధప్రాతిపదికన సీతారామ ఎత్తిపోతల పథకం పనులు

**: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు సీతమ్మ సాగర్ ఆనకట్టను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పనుల పురోగతికి సంబంధించిన అంశాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి హైదరాబాద్ జలసౌధలో ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ఇల్లందుకు సాగునీరు అందించే విషయమై గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యను కూడా సమావేశానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. అనుమతులు, పనుల పురోగతి, భూసేకరణ, సంబంధిత అంశాలపై ఇంజినీర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. సమస్యలుంటే పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతిపాదించిన తరహాలో ఇల్లందు మీదుగా నీరు ఇస్తే జిల్లా మొత్తానికి ప్రయోజనకరంగా ఉంటుందని గుమ్మడి నర్సయ్య మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న డిజైన్ ప్రకారం ముందుకెళ్తూ.. అవసరమైన చోట లింక్ కెనాల్ ద్వారా పనులు చేపట్టవచ్చని ఇంజినీర్లకు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో సీతారామ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు జరగలేదన్న మంత్రి ఉత్తమ్ కుమార్.. కాంగ్రెస్ ప్రభుత్వ కృషితో నీటి కేటాయింపులు జరిగాయని మరోసారి తెలిపారు. సీతమ్మ సాగర్ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించామని.. పనులు వేగవంతం చేసి పూర్తి చేస్తామన్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిధిలో డ్రోన్లపై నిషేధం

**: సైబరాబాద్ సీపీ**



హైదరాబాద్:నగరంలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలో డ్రోన్ల వినియోగంపై నిషేధం విధించారు. విమానాశ్రయానికి 10 కి.మీ. పరిధిలో డ్రోన్లపై నిషేధం విధించినట్లు సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి వెల్లడించారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీపీ తెలిపారు. డ్రోన్లపై నిషేధం జూన్ 9 వరకు అమల్లో ఉంటుందని చెప్పారు.

*** బాణసంచా కాల్చడంపై నిషేధం: సీపీ సీవీ ఆనంద్**

హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో బాణసంచా కాల్చడంపై నిషేధం విధించినట్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా బహిరంగ ప్రదేశాలు, కంటోన్మెంట్ ప్రాంతాల్లో బాణసంచా కాల్చడంపై నిషేధం విధించినట్లు చెప్పారు. ఆకస్మిక శబ్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దని విజ్ఞప్తి చేశారు. బాణసంచా పేలుళ్లను ఉగ్ర కార్యకలాపాలుగా తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందన్నారు. భారత్ పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో పౌరులు సహకరించాలని, పోలీసుల ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

### భారత్‌పాక్ ఉద్రిక్తతలు..

## రైల్వేస్టేషన్లలో భద్రత మరింత కట్టుదిట్టం: ద.మ.రైల్వే



హైదరాబాద్: భారత్ పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు దక్షిణ మధ్య రైల్వే (ద.మ.రైల్వే) సీపీఆర్వో శ్రీధర్ వెల్లడించారు. నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్లైన సికింద్రాబాద్, కాచిగూడలో భారీగా భద్రతను పెంచినట్లు తెలిపారు. సీసీ కెమెరాల సంఖ్యను సైతం పెంచి పర్యవేక్షణ చేస్తున్నట్లు శ్రీధర్ పేర్కొన్నారు. భారత్ పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రత కారణాల దృష్ట్యా దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలను మూసి వేయడంతో రైల్వేస్టేషన్లకు ప్రయాణికుల తాకిడి పెరిగిందన్నారు. దీంతో భద్రత కోసం ప్రత్యేక బలగాలను మోహరించినట్లు చెప్పారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నామని సీపీఆర్వో శ్రీధర్ వెల్లడించారు.



## తెలంగాణలో మూడు రోజులు వర్షాలు.. హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్: తెలంగాణలోని పలు జిల్లాల్లో మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయని పేర్కొంది. ఇవాళ పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 కి.మీ. నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. రానున్న రెండు రోజులు కూడా గంటకు 40 కి.మీ. నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది.

### మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవానికి

## సీఎం రేవంత్ దూరం.. కారణమిదే!

- **మిస్ వరల్డ్ పోటీలపై భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ఎఫెక్ట్**
- **ఈ నేపథ్యంలో పోటీల ప్రారంభోత్సవానికి దూరంగా ఉండాలని సీఎం రేవంత్ నిర్ణయం**
- **గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఇవాళ్టి నుంచి 72వ మిస్ వరల్డ్-2025 పోటీలు ప్రారంభం**



భారత్‌పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ఎఫెక్ట్ ఇప్పుడు హైదరాబాద్‌లో జరిగే 72వ మిస్ వరల్డ్ పోటీలపై పడింది. గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఇవాళ్టి నుంచి ఈ పోటీలు ప్రారంభం కానుండగా... ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎంఓ వర్గాలు వెల్లడించాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తరపున పోటీలకు తరలివచ్చిన అతిథులకు ఇవ్వాల్సిన డిన్నర్ పార్టీని కూడా క్యాన్సిల్ చేసుకున్నారు. ఇక, ఈ పోటీలు దేశానికి, అలాగే తెలంగాణ రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తీసుకురానున్నాయి. అయితే, భారత్ పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇప్పుడు మిస్ వరల్డ్ పోటీ లను రద్దు చేయడం లేదా వాయిదా వేయాలని ప్రతిపక్షాలు అంటున్నాయి. అలాగే విమాన సర్వీసుల మార్పులు, రద్దుల ప్రభావం కూడా ఈ పోటీలపై ఉండనుంది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా 120 దేశాల నుంచి వచ్చే పోటీదారులకు, స్పాన్సర్లకు, అంతర్జాతీయ మీడియాకు పూర్తి స్థాయి భద్రత కల్పించడం అతిపెద్ద సవాలు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని వ్యూహాత్మక ప్రదేశాలు, సాధారణ ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, వీరికి కూడా రక్షణ కల్పించాల్సి ఉంటుంది. మూడు వారాల పాటు ఇంత పెద్ద సంఖ్యలో అంతర్జాతీయ అతిథులకు భద్రత కల్పించడం పోలీసు యంత్రాంగానికి పెను భారంగా మారవచ్చు అనే వాదనలు వినిపిస్తున్నాయి.

## జర్నలిస్టులకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అభినందనలు



భారతదేశ సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల గురించి ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసేలా నిరంతరం విధులు నిర్వహించిన మీడియా జర్నలిస్టులను సీనియర్ ఐపీఎస్ అధికారి, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధులుగా ఉండేది జర్నలిస్టులని, వారి వృత్తి కత్తిమీదసాము లాంటిదని, జర్నలిస్టులను ఎంత పొగిడినా తక్కువేనని కొనియాడారు. శత్రుసైన్యం దాడులు చేసిన ప్రాంతాలను ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ప్రసారం చేయడం మామూలు విషయం కాదన్నారు. “నిజాయితీ, ధైర్యం, బాధ్యతతో నివేదించే జర్నలిస్టులకు వందనం. సత్యం, ప్రజాసేవ పట్ల మీ నిబద్ధత, తరచుగా వ్యక్తిగతంగా చాలా ప్రమాదంలో ఉన్నప్పటికీ, దేశానికి సమాచారం అందిస్తున్నారు. ముఖ్యమైన పనిని చేసినందుకు ధన్యవాదాలు.” అని సజ్జనార్ చేసిన పోస్ట్ లో పేర్కొన్నారు.

# ఎల్లప్పుడూ... సిద్ధంగా!

**బయట అడుగు పెడుతున్నామంటే ఒకటికి రెండుసార్లు అన్నీ గమనించుకుంటాం. అంతలా జాగ్రత్త తీసుకున్నా ఏదో ఒకటి మర్చిపోతుంటాం. కొన్నిసార్లు ఆ చిన్న అజాగ్రత్త మనవాళ్లని కంగారు పెట్టేస్తుంది. అందుకే, ఈ కొన్ని సాయాలను దగ్గరుంచుకోండి.**





*** మందు బిళ్ల... మర్చిపోకుండా...**

పీసీఓడీ, హార్మోనుల్లో అసమతుల్యత... చిన్నప్పట్నుంచే ఏదో ఒక మెడిసిన్ వేసుకోవాల్సిన పరిస్థితి. కాబట్టి, మందులు ఎప్పుడూ వెంట ఉండాల్సిందే. దూర ప్రయాణాలైతే గుర్తుంచుకుంటాం. ఒకట్రెండు రోజులు వెళ్లాల్సొస్తే నే మర్చిపోతాం. అందుకే ఈ కీ చెయిన్ పిల్ హోల్డర్‌ను దగ్గర ఉంచుకోండి. వీటిలో ట్యాబ్లెట్లను నింపుకొని బ్యాగుకు తగిలించుకుంటే సరి. ఒకటి కంటే ఎక్కువ ఉంటే భిన్న కంపార్ట్‌మెంట్లు ఉన్నవాటిని ఎంచుకోండి. పూలతో, భిన్న డిజైన్లతోనూ దొరుకుతున్నాయి కాబట్టి, బ్యాగుకు తగిలించుకున్నా అందంగా ఉంటాయి. వాటర్‌ప్రూఫ్ కాబట్టి, తడిచినా ప్రమాదముండదు.

*** ఆలస్యమైనా భయముండదు**

కాస్త చీకటి పడి, అమ్మాయి ఫోన్ కలవకపోతే ఆ తల్లిదండ్రులు పడే భయాన్ని మాటల్లో చెప్పగలమా... పనిమీద బయటికెళ్లి ఫోన్ స్విచ్ ఆఫ్ అయితే మనకీ ఇబ్బందే. ఫోన్ ఛార్జ్ చేసుకోవడం, ఛార్జింగ్ పెట్టి స్విచ్ వేయడం మర్చిపోవడం వల్లే ఇలాంటి ఇబ్బందులు. అందుకే ఈ కీ చెయిన్ పోర్టబుల్ ఛార్జర్లను తెచ్చుకోండి. బండి లేదా ఇంటి తాళాలకో, బ్యాగుకో తగిలిస్తే సరి. కావాల్సినప్పుడు ఫోన్‌కి పెడితే చక్కగా ఛార్జింగ్ అందిస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేసుకుంటే మూడు నాలుగుసార్లకు పనికొస్తుందట.










**అత్యవసరానికో కిట్**

అనుకోకుండా ఏవో గీరుకోవడం, చిన్న చిన్న ప్రమాదాలు... రోజూ బస్సుల్లో ప్రయాణించేవారికి ఇవి పరిచయాలే. ఆసుపత్రులకు వెళ్లేంత పెద్దవి కాదు, అలాగని ఊరుకుంటే ఇన్‌ఫెక్షన్ ప్రమాదం. అందుకే ట్రావెల్ ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను దగ్గరుంచుకోవాలి. పిన్నులు, కత్తెర, కాటన్, బ్యాండ్ ఎయిడ్లు, యాంటీ సెప్టిక్ లిక్విడ్, బర్న్ క్రీమ్... ఇలా అన్నీ కొన్ని చొప్పున దానిలో ఉంటాయి. బ్యాగులో ఉంచుకుంటే సరి. తగిలించుకోవచ్చు కూడా. అమ్మాయిల కోసం ప్రత్యేక బ్యాగుల్లోనూ వస్తున్నాయి. అత్యవసర సమయాల్లో ఈ కిట్ చాలా ఉపయోగపడుతుంది. కొని బ్యాగులో ఉంచుకుంటే సరి.

# ఆర్టిఫిషియల్ నగలతో.. అలర్జీనా?



**ఆడవాళ్లకు, నగలకు అవినాభావ సంబంధం ఉంటుంది. అయితే వీటిని ఎంత ఇష్టంగా ధరించినా.. వీటి తయారీలో వాడే కొన్ని లోహాలు కొంతమంది చర్మతత్వాలకు సరిపడవు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ నగల విషయంలో ఈ సమస్య ఎక్కువగా తలెత్తుతుంటుంది. ఫలితంగా చర్మంపై ఎర్రటి దద్దుర్లు, దురద, మంట.. వంటి సమస్యలొస్తాయి. మరి, వీటి నుంచి విముక్తి పొందడమెలాగో తెలుసుకుందాం రండి..**

ఆర్టిఫిషియల్ నగల తయారీలో నికెల్ లోహాన్ని వాడుతుంటారు. చాలా మందిలో అలర్జీ రావడానికి ఇదే ముఖ్య కారణమంటున్నారు నిపుణులు. ముఖ్యంగా సున్నితమైన చర్మతత్వం ఉన్న వారిలో దీని కారణంగా దురద, దద్దుర్లు, ఎరుపెక్కడం.. వంటి సమస్యలొస్తాయంటున్నారు. అలాంటి వారికి ఈ చిట్కాలు మేలు చేస్తాయి.

* నగల అలర్జీ ఉన్నవారు వాటిని ధరించే ముందు మాయిశ్చరైజర్, పౌడర్, క్యాలమైన్ లోషన్స్.. వంటివి రాసుకోవాలి. ఇవి చర్మానికి కవచంలా పనిచేసి ఆయా లోహాల ప్రభావం చర్మంపై పడకుండా చేస్తాయి.
* అవుట్‌ఫిట్ ఏదైనా.. కొంతమంది మెడ దగ్గరగా ఉండే చోకర్, నెక్‌పీస్.. వంటి బిగుతుగా ఉండే జ్యుయలరీని ఎంచుకుంటారు. దీనివల్ల గాలి ఆడక కూడా అలర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే వీలైనంతవరకు వదులుగా ఉండే నెక్‌పీస్‌లు, లాంగ్ చెయిన్స్.. వంటివి ఎంచుకోవాలి.
* ధరించే ముందు ట్రాన్స్‌పరెంట్ నెయిల్ పాలిష్‌ను నగలపై ఓ కోటింగ్ వేసి.. ఆపై వేసుకోవడం మంచిది. ఇది నగల్లోని లోహాల ప్రభావం చర్మంపై పడకుండా కాపాడుతుంది.
* ఆర్టిఫిషియల్ నగలే కదా అని వీటి విషయంలో చాలామంది అంత శ్రద్ధ తీసుకోరు. తడిసినా, చెమట పట్టినా.. అలాగే వాటిని బాక్సుల్లో భద్రపరుస్తుంటారు. ఆ తడిదనం వల్ల నగల నాణ్యత దెబ్బతింటుంది. ఇది కూడా చర్మ అలర్జీలకు కారణమవుతుంది. కాబట్టి నగల్ని భద్రపరిచే ముందు పూర్తిగా ఆరనివ్వడం మేలు. అలాగే తేమ అధికంగా ఉండే ప్రదేశాల్లో వీటిని భద్రపరచకూడదు.
* నగల వల్ల చర్మంపై దురదగా అనిపిస్తే.. ఆ ప్రదేశంలో కలబంద గుజ్జును అప్లై చేసుకోవాలి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు సమస్య నుంచి త్వరిత ఉపశమనం కలిగిస్తాయి.
* గోల్డ్, సిల్వర్ కోటింగ్‌తో తయారుచేసిన వాచ్‌లను ధరించడం వల్ల కొంతమందిలో రాషెస్ రావడం చూస్తుంటాం. ఇలాంటి వాళ్లు లెదర్, క్లాత్.. వంటి మెటీరియల్‌తో తయారుచేసిన వాచ్ బెల్టుల్ని ప్రత్యామ్నాయంగా ఎంచుకోవచ్చు.





## పాకిస్థాన్‌కు అంతర్జాతీయ రుణ సంస్థల నుంచి భారీగా అప్పు..!




**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ ద్రవ్య నిధి ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ చివరకు పాకిస్తాన్‌కు రుణం ఇచ్చేందుక అంగీకరించింది. 1 బిలియన్ డాలర్ల(మన కరెన్సీలో దాదాపు రూ.8540 కోట్లు.)అదే పాకిస్థాన్ కరెన్సీలో దాదాపు రూ.28 వేల కోట్ల రుణం అందించడానికి అంగీకరించింది. ఐఎంఎఫ్ పాకిస్తాన్‌కు రుణాలు అందించటంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రుణ ప్రతిపాదనను ఓటింగ్‌కు ఉంచినప్పుడు భారతదేశం మాత్రమే ఆ ఓటింగ్‌కు దూరంగా ఉంది. ఐఎంఎఫ్ నిర్ణయాన్ని వ్యతిరేకించడానికే భారతదేశం ఈ నిర్ణయం తీసుకుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ కింద ఇవ్వదలచిన 700 కోట్ల డాలర్లలో 100 కోట్ల డాలర్ల విడుదల, కొత్త అప్పు కింద మరో 130 కోట్ల డాలర్లు.. మొత్తం కలిపి 230 కోట్ల డాలర్ల రుణం ఇచ్చే ప్రతిపాదనలను పరిశీలించేందుకు ఐఎంఎఫ్ శుక్రవారం బోర్డు మీటింగ్ నిర్వహించింది. కానీ, పాక్ అప్పు ఇచ్చే విషయంలో ఓటింగ్‌కు దూరంగా ఉండటం ద్వారా భారతదేశం తీవ్ర అసమ్మతిని వ్యక్తం చేసింది. అధికారికంగా తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసింది.

గత35 ఏళ్లలో 28 సార్లు పాక్ అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి రుణాలు తీసుకుందని, గడిచిన ఐదేళ్లలో నాలుగు ఐఎంఎఫ్ ప్రోగ్రామ్‌లు పాక్‌లో అమలయ్యాయని గుర్తుచేసింది. కానీ, ఆ రుణాలు ఇచ్చే సమయంలో ఐఎంఎఫ్ పెట్టే షరతులకు కట్టుబడి ఉండడంలో, వాటిని అమలు చేయడంలో మాత్రం పాక్‌కు ఎప్పుడు కట్టుబడి లేదని, ఈ విషయాల్లో పాక్‌కు ఎక్కడా మంచి రికార్డు లేదని భారత్ ధ్వజమెత్తింది. గతంలో తీసుకున్న అప్పులను పాక్ సక్రమంగా వినియోగించులేదని ఆరోపించింది. ఐఎంఎఫ్ నుంచి నిధులు వస్తూ ఉంటే.. పాక్ వాటిని సైన్యానికి, ప్రభుత్వ ప్రాయోజిత సీమాంతర ఉగ్రవాదుల కోసం వినియోగిస్తుందని భారత్ ధ్వజమెత్తింది. ఆ నిధులను పాక్ సక్రమంగా వినియోగించి ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండేదని చెప్పుకొచ్చింది భారత్.

## భారత వాయుసేన దాడులు.. పాకిస్థాన్‌లో చమురు సంక్షోభం..

### రాజధానిలో పెట్రోల్ బంకులు క్లోజ్..




**న్యూఢిల్లీ:** భారత వైమానిక దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న పాక్‌కు మరో సంక్షోభం వచ్చిపడింది. భారత్ దాడితో కుదేలవుతున్న పాక్‌ను ఇప్పుడు చమురు కొరత వేధిస్తోంది. ఇస్లామాబాద్ రాజధాని టెరిటరీ అడ్మినిస్ట్రేషన్ రాజధాని నగరంలోని అన్ని పెట్రోల్, డీజిల్ ఫిల్లింగ్ స్టేషన్లను రాబోయే 48 గంటల పాటు పూర్తిగా మూసివేయాలని తక్షణ ఉత్తర్వు జారీ చేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి 48 గంటల పాటు ఇస్లామాబాద్‌లోని అన్ని పెట్రోల్ బంకులను మూసివేస్తున్నట్టుగా అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. అయితే, పెట్రోల్ బంకులు మూసి వేయడానికి గల కారణాలు ఏంటనే విషయంపై స్పష్టమైన వివరాలు మాత్రం తెలిసి రాలేదు. కాగా, పాక్‌లోని 4 ఎయిర్ బేస్‌లపై భారత్ దాడి చేసింది. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమయ్యాయి.

## పసిడి ప్రియులకు ఊరట..

### భారీగా దిగొచ్చిన బంగారం ధరలు!



**న్యూఢిల్లీ:** సామాన్యులకు శుభవార్త..! గత కొన్ని రోజులుగా సామాన్యులకి చుక్కలు చూపిస్తున్న పసిడి పరుగులకు కాస్త కళ్లెం పడినట్లుగా ఉంది.. బంగారం ధరలు శనివారం భారీగా తగ్గాయి. భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో బంగారం ధరలు తగ్గాయి. యుద్ధ ప్రభావాలు కాకుండా ప్రపంచ మార్కెట్ సహజ ప్రవర్తన ధరల తగ్గుదలకు కారణం అంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. బంగారం కొనుగోలు చేయాలని ప్లాన్ చేస్తున్న వారికి ఇది గొప్ప గుడ్ న్యూస్ అంటున్నారు నిపుణులు.. ఎందుకంటే నేడు బంగారం ధర భారీగా తగ్గింది. దేశంలో శనివారం 24 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాము రూ.9,834లుగా ఉంది. అది 22 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాముకు రూ.9,014లుగా ఉంది. అటు18 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాముకు రూ.7,375లుగా పలుకుతోంది. ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.90,140, 24 క్యారెట్ల ధర రూ.98,340 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.90,140, 24 క్యారెట్ల రేటు రూ.98,340 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.90,140, 24 క్యారెట్ల ధర రూ.98,340 గా ఉంది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,140, 24 క్యారెట్ల ధర రూ.98,340 గా ఉంది. విశాఖపట్నంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,760, 24 క్యారెట్ల ధర రూ.99,010 గా ఉంది. విజయవాడలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,140, 24 క్యారెట్ల ధర రూ.98,340 గా ఉంది.

ఇక శనివారం వెండి ధరల విషయానికి వస్తే.. పసిడితో పాటే వెండి ధర కూడా దిగొచ్చింది. గ్రాము 110.90లు ఉండా, కిలో వెండి ధర రూ.1,10,900లుగా పలుకుతోంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1,10,900, విజయవాడ, విశాఖపట్నంలో రూ.1,11,100, ఢిల్లీలో వెండి కిలో ధర రూ.98,900, ముంబైలో రూ.98,900, బెంగళూరులో రూ.98,900, చెన్నైలో రూ.1,10,900 లుగా ఉంది.

# ఉద్రిక్తతలకు తెర

## ఐపీఎల్ పునరుద్ధరణ దిశగా బీసీసీఐ..!



**న్యూఢిల్లీ:** భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలకు తెరపడింది. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఇరుదేశాలు శనివారం కాల్పుల విరమణకు అంగీకరించాయి. దాంతో, యుద్ధ వాతావరణం తొలగిపోయి సాధారణ పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. ఈ నేపథ్యంలో వారం రోజుల పాటు వాయిదా వేసిన ఐపీఎల్ 18వ సీజన్ పునరుద్ధరణపై బీసీసీఐ దృష్టి సారించనుంది. మిగతా 16 మ్యాచ్‌లను నిర్వహించి లీగ్‌ను విజయవంతం చేయడం కోసం కార్యాచరణ సిద్ధం చేయనుంది.

ఉద్రిక్తతల నేపథ్యంలో ధర్మశాల వేదికగా మే 8వ తేదీన ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ మధ్య మ్యాచ్‌ను అర్ధాంతరంగా రద్దు చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత ఫ్రాంచైజీ యజమానులతో, బ్రాడ్‌కాస్టింగ్ సంస్థలతో చర్చలు జరిపిన బీసీసీఐ ఐపీఎల్‌ను వారం రోజులు వాయిదా వేసింది. ఇప్పుడు ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడంతో పరిస్థితులు చక్కబడే అవకాశముంది.

దాంతో, తదుపరి 16 మ్యాచ్‌లను హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో నిర్వహించాలనుకున్న బీసీసీఐ .. తన ఆలోచన మార్చుకునేందుకు ఆస్కారముంది. ఇంతకుముందున్న షెడ్యూల్ ప్రకారమే మ్యాచ్‌లు జరిగేందుకు వీలుంది. కొన్ని డబుల్ హెడర్స్ ఆడించడం ఖాయమని అనిపిస్తోంది. అయితే.. షెడ్యూల్ గురించి బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

'ఆపరేషన్ సిందూర్' తదనంతర పరిణామాలతో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొనడం.. ఐపీఎల్ వాయిదాకు దారి తీశాయి. దేశం కంటే తమకు ఏదీ ముఖ్యం కాదంటూ బీసీసీఐ లీగ్‌కు బ్రేక్ ఇచ్చింది. ఆటగాళ్ల భద్రతను దృష్టిలో ఉంచుకొని వాయిదాకే మొగ్గు చూపింది ఐపీఎల్ పాలక మండలి. ధర్మశాలలో చిక్కుకుపోయిన ఢిల్లీ, పంజాబ్ కింగ్స్ ఆటగాళ్లు, సిబ్బంది.. మీడియా, కామెంటేటరీ సభ్యులను భారీ భద్రత నడుమ 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్'లో సురక్షితంగా ఢిల్లీకి తరలించింది బీసీసీఐ. అయితే.. భారత్, పాక్‌ల మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో కొందరు విదేశీ క్రికెటర్లు స్వదేశాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు కూడా.



## పోరాడి ఓడిన యువ షట్లర్లు

### పతక ఆశలు ఆవిరి..!

**న్యూఢిల్లీ:** తైపీ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్ల పోరాటం ముగిసింది. దాంతో, పతక ఆశలు ఆవిరయ్యాయి. శనివారం జరిగిన సెమీఫైనల్లో ఆయుష్ శెట్టి, ఉన్నాతి హుడాలు ఓటమి పాలయ్యారు. తమ తమ విభాగాల్లో అద్భుత విజయంతో పతంకపై ఆశలు రేపిన వీళ్లు.. ఊహించని పరాజయంతో టోర్నీ నుంచి నిష్క్రమిచారు.పురుషుల సింగిల్స్‌లో భారత సీనియర్ ఆటగాడు కిడాంబి శ్రీకాంత్‌ను ఇంటికి పంపిన ఆయుశ్.. సెమీస్‌లో స్థానిక ఆటగాడు చౌ థియెన్ జోరు ముందు నిలవలేకపోయాడు. హెూరాహెూరీగా తలపడిన ఈ యంగ్‌స్టర్ చివరకు 18-21, 17-21తో మ్యాచ్ చేజార్చుకున్నాడు.





మహిళల సింగిల్స్‌లో అసమాన విజయాలతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లిన ఉన్నాతి కఠినమైన ప్రత్యర్థిని చిత్తు చేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో హుంగ్ యీ టింగ్‌ను ఓడించింది. అయితే.. అదే జోరును సెమీస్‌లో చూపించలేకపోయింది. జపాన్ షట్లర్ తొమొక మియాజకీతో 43 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో 19-21, 11-21తో ఓటమి పాలైంది.





### లంకతో ఫైనల్.. టైటిల్‌పై కన్నేసిన

## భారత అమ్మాయిలు

**కొలంబో:** వన్డే వరల్డ్ కప్ ముందు భారత మహిళల జట్టు ముక్కోణపు వన్డే సిరీస్ ఫైనల్లో శ్రీలంకతో తలపడనుంది. టాపార్డర్, మిడిలార్డర్ సమిష్టిగా రాణిస్తుండడం, బౌలర్లు చెలరేగుతుండడంతో టీమిండియాకు విజయావకాశాలు మెరుగ్గానే ఉన్నాయి. అయితే.. చమరి ఆటపట్టు బృందాన్ని తక్కువ అంచనా వేయడానికి లేదు. లీగ్ దశలో ఇరుజట్లు చెరొక మ్యాచ్ గెలుపొందాయి. దాంతో, ఆదివారం ప్రేమదాస స్టేడియంలో జరుగబోయే బిగ్ ఫైట్‌లో విజయం ఎవరిని వరిస్తుంది? ట్రోఫీని ముద్దాడేది ఎవరు? అనేది ఆసక్తికరంగా మారింది.

టీ20 వరల్డ్ కప్‌లో దారుణ ప్రదర్శన తర్వాత భారత జట్టు పుంజుకుంది. ముక్కోణపు సిరీస్‌లో సమిష్టిగా రాణిస్తూ శ్రీలంక, దక్షిణాఫ్రికాలకు చెక్ పెట్టింది. ఆరంభ పోరులో ఓపెనర్లు ప్రతీకా రావల్ అర్ధ శతకంతో రెచ్చిపోగా లంకపై 9 వికెట్ల తేడాతో గెలుపొందింది హర్మన్‌ప్రీత్ సేన. ఆ తర్వాత సఫారీలను 15 పరుగుల తేడాతో చిత్తు చేసింది.

అయితే.. తదుపరి పోరులో శ్రీలంక 3 వికెట్లతో విజయం సాధించి భారత్‌కు షాకిచ్చింది. ఆ తర్వాత దక్షిణాఫ్రికాను ఓడించిన ఇండియా.. ఫైనల్‌కు దూసుకెళ్లింది. టైటిల్ పోరులో ఆతిథ్య లంకను ఢీ కొట్టేందుకు సిద్ధమైంది. ఆదివారం 4:30 గంటలకు మ్యాచ్ షురూ కానుంది

### ట్రోఫీ కల సాకారం

నిరుడు ఆసియా కప్ ఫైనల్లో భారత జట్టు ఆధిపత్యానికి శ్రీలంక గండి కొట్టింది. హర్మన్‌ప్రీత్ కౌర్ బృందానికి షాకిస్తూ శ్రీలంక విజేతగా నిలిచింది. దంబుల్లా వేదికగా జరిగిన మ్యాచ్‌లో లంక బౌలర్ల ధాటికి భారత్ 165 పరుగులకే పరిమితమైంది. ఛేదనలో ఆదిలోనే వికెట్లు పడినా హర్షిత సమరవిక్రమ 69 అజేయంగా నిలిచి చిరస్మరణీయ విజయంతో ట్రోఫీ కలను సాకారం చేసింది.

## ఏడో స్థానంలో రికార్డు సెంచరీ..

### రెండో బ్యాటర్‌గా సఫారీ క్రికెటర్..!

**కొలంబో:** అంతర్జాతీయ క్రికెట్‌లో దక్షిణాఫ్రికా క్రికెటర్ అన్నేరీ డెరిక్సెన్ చరిత్ర సృష్టించింది. 7వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి అత్యధిక స్కోర్ చేసిన రెండో మహిళగా రికార్డు నెలకొల్పింది. ముక్కోణపు వన్డే సిరీస్ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అన్నేరీ సెంచరీ బాదడం ద్వారా ఈ ఘనత సాధించింది.

కొలంబో మైదానంలో శ్రీలంక బౌలర్లను ఉతికారేసిన ఈ సఫారీ సంచలనం.. 104 పరుగులు చేసి ఔటయ్యింది. తద్వారా ఏడో స్థానంలో ఆడి శతకం చేసిన రెండో క్రికెటర్‌గా చరిత్రకెక్కింది. ఆమె కంటే ముందు వెస్టిండీస్ క్రికెటర్ షెమైనె క్యాంప్‌బెల్ ఈ మైలురాయికి చేరుకుంది. ఈ డాషింగ్ బ్యాటర్ 2013లో శ్రీలంకపైనే 105 రన్స్ చేసింది. ప్రస్తుతం తనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇంగ్లండ్‌కు చెందిన అమీ జోన్స్ 92 నాటౌట్‌తో మూడో స్థానంలో ఉంది.

### ఏడో స్థానంలో సెంచరీ

వన్డే క్రికెట్‌లో 7వ స్థానంలో ఆడుతూ సెంచరీ బాదిన మహిళా క్రికెటర్లు మొత్తం 10 మంది. వీళ్లలో డెరిక్సెన్‌తో కలిపి సఫారీ ప్లేయర్లు ముగ్గురు ఉన్నారు. న్యూజిలాండ్ నుంచి ఇద్దరు.. ఇంగ్లండ్, స్కాట్లాండ్, పాకిస్థాన్ నుంచి ఒకరు శతకం సాధించారు.

1. షెమైనే క్యాంప్‌బెల్ వెస్టిండీస్ 105 పరుగులు 2013లో శ్రీలంకపై
2. అనేరీ డెరిక్సన్ దక్షిణాఫ్రికా 104 2025లో శ్రీలంకపై
3. అమీ జోన్స్ ఇంగ్లండ్ 92 నాటౌట్ %-% 2024లో న్యూజిలాండ్‌పై
4. క్లో ట్రయాన్ దక్షిణాఫ్రికా 92 2016లో ఐర్లాండ్‌పై
5. రెబెక్కా రాల్స్ న్యూజిలాండ్ 84 నాటౌట్ 1999 దక్షిణాఫ్రికాపై
6. అలియా రియాజ్ పాకిస్థాన్ 81, 2021లో దక్షిణాఫ్రికాపై
7. అల్లీ కుయ్‌లార్స్ దక్షిణాఫ్రికా 74 నాటౌట్, 1997లో పాకిస్థాన్‌పై.
8. సోఫీ డెవినె న్యూజిలాండ్ 74 నాటౌట్, 2010లో ఆస్ట్రేలియాపై
9. కత్రినే ఫ్రేజర్ స్కాట్లాండ్ 74 నాటౌట్, 2024లో పపువా న్యూగినియాపై
10. క్లో ట్రయాన్ దక్షిణాఫ్రికా 74, శ్రీలంకపై 2025లో.




ముక్కోణపు వన్డే సిరీస్ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జయభేరి మోగించింది. అన్నేరీ డెరిక్సెన్ సూపర్ సెంచరీతో చెలరేగగా శ్రీలంకను సఫారీ జట్టు చిత్తుగా ఓడించింది. దాంతో, విజయంతో టోర్నీని ముగించింది. తాను ఎదుర్కొన్న మూడో బంతినే బౌండరీకి తరలించిన డెరిక్సెన్ ఇన్నింగ్స్ ఆసాంతం దూకుడుగా ఆడింది. లంక బౌలర్లపై ఎదురు దాడికి దిగిన తను తొలి సెంచరీ సాధించింది. 84 బంతుల్లోనే 9 ఫోర్లు, 5 సిక్సర్లతో మూడంకెల స్కోర్ అందుకుంది.

అనంతరం 316 పరుగుల ఛేదనలో లంకను దక్షిణాఫ్రికా స్పిన్నర్ క్లో ట్రయాన్ (5-34) దెబ్బకొట్టింది. ఐదు వికెట్లు తీసి ఆతిథ్య జట్టు పతనాన్ని శాసించింది. కెప్టెన్ చమరి ఆటపట్టు(52), అనుష్క సంజీవని(43)లు పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు.



### దశాబ్దాల బాధకు

# ఇది సమాధానం

### యుద్ధంపై జాన్వీకపూర్ పోస్ట్

**టాకీస్:** పాకిస్థాన్-భారత్ యుద్ధ నేపథ్యంలో ఇండియన్ ఆర్మీపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు కురుస్తూనే ఉన్నాయి. సామాన్యుడి నుంచి సెలబ్రిటీల దాకా అందరూ ఇండియన్ ఆర్మీకి మద్దతు పలుకు తున్నారు. జాన్వీకపూర్ ఇప్పటికే వరుసగా పోస్టులు పెడుతూ ఇండియన్ ఆర్మీకి మద్దతు ప్రకటిస్తోంది. తాజాగా యుద్ధ వాతావరణం గురించి సుదీర్ఘ పోస్టు పెట్టింది. 'ఇన్ని రోజులు మనం యుద్ధం రావొద్దనే కోరుకున్నాం. కానీ టెర్రరిస్టుల మన ప్రజలను చంపుతుంటే సహించేది లేదు. ఇండియా ఎన్నడూ కయ్యానికి కాలు దువ్వలేదు. ఇన్ని రోజులు మన మీద జరిగిన దాడులను తిప్పి కొడుతున్నాం. కానీ దశాబ్దాల బాధ ఇప్పుడు పెరిగింది. ఆ బాధను తీర్చుకోవడానికే ఇప్పుడు మన ఇండియన్ ఆర్మీ రంగంలోకి దిగింది. ఇది దూకుడు కాదు.. దశాబ్దాల బాధకు సమాధానం. టెర్రరిస్టులు అనే వారు భూమ్మీద ఉండటానికి వీల్లేదు. మన సైనికులు బార్డర్ దగ్గర పోరాడుతూ మనల్ని కాపాడుతున్నారు. మన దేశ సౌభ్రాతృత్వాన్ని కాపాడుతున్న సైనికులకు ఎప్పటికీ రుణపడి ఉండాలి. వాళ్ల వల్లే మనం సేఫ్ గా ఉంటు-న్నాం. ఇలాంటి టైమ్‌లో దేశమంత మన ఇండియన్ ఆర్మీకి మద్దతు నిలవాలి. ఎలాంటి ఫేక్ న్యూస్ ను వ్యాప్తి చేయొద్దు' అంటూ చెప్పుకొచ్చింది ఈ బ్యూటీ.

# మరోమారు విజయ్,రష్మికల జోడీ

**టాకీస్:** విజయ్ దేవరకొండ ఈ నెలలోనే 'కింగ్డమ్' సినిమాతో సందడి చేయనున్నారు. ఆ తర్వాత ఆయన చేయనున్న సినిమాలు ఇప్పటికే ఖరారైన సంగతి తెలిసిందే. రెండు సినిమాలూ సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాయి. విజయ్ దేవరకొండ పుట్టినరోజుని పురస్కరించుకుని శుక్రవారం ఆయా సినిమాలకి సంబంధించిన పోస్టర్లని విడుదల చేశాయి చిత్రబృందాలు. విజయ్ దేవరకొండ (÷శా ఉ ।÷ఎ।సశుశ) కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్, టి.సిరీస్ సంస్థలు కలిసి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, భూషణ్‌కుమార్, క్రిషన్ కుమార్ నిర్మాతలు. ఇందులో విజయ్ సరసన రష్మిక కథానాయిక.



బ్రిటిష్‌పాలన కాలం నేపథ్యంలో, 1854 - 1878 మధ్య జరిగిన చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. విజయ్ ధ్యానముద్రలో ఉన్న లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో, ఇప్పటివరకూ ఎవరూ స్పృశించని కథాంశంతో వస్తున్న ఓ శక్తిమంతమైన సినిమా ఇదని చిత్రవర్గాలు తెలిపాయి. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా, రవికిరణ్ కోలా దర్శకత్వంలోనూ ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు - శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా, పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా రూపొందుతోంది. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తున్నట్టు-గా ప్రకటిస్తూ, లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. భారతీయ సైన్యానికి తన వంతు బాధ్యతగా విరాళాన్ని అందజేయనున్నట్టు- తెలిపారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. రానున్న కొన్ని వారాలపాటు- తన క్లాత్ బ్రాండింగ్ రౌడీ వేర్ అమ్మకాలతో వచ్చే లాభాల్లో కొంత వాటాని భారత సైన్యానికి విరాళంగా ఇవ్వనున్నట్టు- ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. మేడ్ ఇన్ ఇండియా మాత్రమే కాదు, మేడ్ ఫర్ ఇండియా కూడా అంటూ తన సామాజిక మాధ్యమాల ద్వారా ఓ పోస్ట్‌ని పంచుకున్నారు విజయ్.



# ఫ్యాబులస్ అతుల్య..

టాకీస్: అతుల్య రవి కోయంబత్తూరుకి చెందిన నటి. ఆమె ప్రధానంగా తమిళ చిత్రాలలో నటిస్తుంది. ఆమె 2017లో చలనచిత్ర అరంగేట్రం చేసింది. తర్వాత కొన్ని తమిళ సినిమాల్లో కథానాయనికి ఆకట్టుకుంది. తెలుగులో కూడా సుపరిచితురాలు. 21 డిసెంబర్ 1994లో తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో జన్మించింది అతుల్య రవి. ఈమె అసలు పేరు దివ్య. తమిళనాడులోని కోయంబత్తూరులోని వివేకం మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో పాఠశాల విద్యను అభ్యసించింది. తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులోని కర్పగం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదివింది. చెన్నైలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో, కోయంబత్తూరులోని శ్రీ కృష్ణ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో చదువుకుంది. 'పల్వాది కాదల్' అనే ఓ తమిళ యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్ ద్వారా నటనలో కెరీర్ ప్రారంభించింది ఈ వయ్యారి భామ. 2017లో కాదల్ కన్ కట్టుదే అనే ఓ తమిళ చిత్రంలో కథానాయకిగా సినీ అరంగేట్రం చేసింది ముద్దుగుమ్మ అతుల్య రవి. 2018లో దురై యేమాలిలో ప్రధాన పాత్రలో నటించింది. తర్వాత ఎన్నో హిట్ చిత్రాల్లో నటించింది ఈ చిన్నది. 2023లో యంగ్ హీరో కిరణ్ అబ్బవరంకి జోడిగా మీటర్ అనే చిత్రంతో హీరోయిన్ గా తెలుగుతెరకు పరిచయం అయింది ఈ బ్యూటీ. ప్రస్తుతం తమిళంలో చెన్నై సిటీ గ్యాంగ్‌స్టార్స్ అనే కామెడీ హేస్ట్ చిత్రంలో నటిస్తుంది ఈ ముద్దుగుమ్మ. దీంతో పాటు డీజిల్ అనే మరో సినిమాలో కథానాయకిగా నటిస్తుంది. ఈ రెండు సినిమాలు త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.



### బబుల్‌గమ్ బ్యూటీ అందాలు

# అదరహో

టాకీస్: మోడలింగ్‌తో తన కెరీర్‌ను ప్రారంభించిన మానస, ఒక స్నేహితుడి సహాయంతో దర్శకుడు రవికాంత్‌కు తన ప్రొఫైల్ పంపించడం ద్వారా తొలి అవకాశంపొందింది. 2023లో విడుదలైన బబుల్‌గమ్ సినిమాలో హీరోయిన్‌గా తొలిసారి నటించింది. బబుల్‌గమ్ సినిమాలో హీరోయిన్‌గా తొలిసారి నటించింది ఈ చిన్నది. బబుల్‌గమ్ సినిమాలో హీరోయిన్‌గా తొలిసారి నటించింది ఈ చిన్నది. ఈ చిత్రంలో స్టార్ యాంకర్ సుమ కనకాల కుమారుడు రోషన్ కనకాల హీరోగా నటించారు. ఈ సినిమాలో రొమాంటిక్ సీన్స్ లోనూ అద్భుతంగా నటించింది. ఈ సినిమా కాకుండా ముస్తఫా ముస్తఫా అనే సినిమాలో కూడా నటించింది. 2024లో విడుదలైన లక్కీ భాస్కర్ చిత్రంలో దుల్కర్ సల్మాన్ సరసన చిన్న పాత్రలో నటించింది మానస చౌదరి. ఈ సినిమాలో గ్లామరస్ గా కనిపించి మెప్పించింది. తన క్యూట్ లుక్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ భామ. లక్కీ భాస్కర్ సినిమా తెలుగు, మలయాళం, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో విడుదలై ఈ ముద్దుగుమ్మకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. మానస చౌదరి తన నటనతో పాటు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటూ ఆకట్టుకుంటుంది. మానస చౌదరి ఇంకా తన సినీ ప్రయాణంలో ప్రారంభ దశలోనే ఉంది. ఇప్పుడిప్పుడే మంచి అవకాశాలు అందుకుంటుంది.

# ప్రదీప్ రంగనాథన్..డ్యూడ్ మూవీ

**టాకీస్:** తమిళ సినీ ఇండస్ట్రీలో 'లవ్ టుడే' సినిమాతో నటుడిగా, డైరెక్టర్‌గా సంచలన ఎంట్రీ ఇచ్చిన ప్రదీప్ రంగనాథన్, 'డ్రాగన్' సినిమాతో తన సక్సెస్ జర్నీని కంటిన్యూ చేశాడు. ఈ ద్విభాషా మూవీ తమిళ, తెలుగు ఆడియన్స్‌ను ఫిదా చేస్తూ అతని ఫేమ్‌ను మరో లెవెల్‌కి తీసుకెళ్లింది. బ్యాక్ టు- బ్యాక్ హిట్స్‌తో జోష్‌లో ఉన్న ప్రదీప్, ఇప్పుడు బిగ్ బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న పాన్ ఇండియా మూవీలో హీరోగా చేస్తున్నాడు. ఈ సినిమాతో కీర్తిస్వరన్ డైరెక్టర్‌గా డెబ్యూ చేయబోతున్నాడు. 'ప్రేమలు' స్టార్ మమితా బైజు ఈ సినిమాలో హీరోయిన్‌గా కనిపించనుండగా, సీనియర్ యాక్టర్ శరత్ కుమార్ ఓ కీలక రోల్‌లో నటిస్తున్నాడు. మేకర్స్ సినిమా టైటిల్‌ను ఆఫీషియల్‌గా రివీల్ చేసి, పోస్టర్‌ను లాంచ్ చేశారు.



అలాగే, రిలీజ్ డేట్ గురించి కూడా బిగ్ అనౌన్స్‌మెంట్ చేశారు. 'డ్యూడ్' అనే కూల్, యూత్‌ఫుల్ -టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ప్రదీప్ రంగనాథన్ సీరియస్ అండ్ ఇం-టె-న్స్ లుక్‌లో దర్శనమిచ్చాడు. అతని ఫేస్‌పై గాయాలు, హ్యాండ్‌లో మంగళసూత్రం, గట్స్‌తో నిండిన ఎక్స్‌ప్రెషన్‌తో ఈ పోస్టర్ కళ్లు చెదిరేలా ఉంది. -టైటిల్, ఫస్ట్ లుక్ చూస్తే, 'డ్యూడ్' ఒక మోడర్న్ ట్విస్ట్‌తో ఫుల్ ఎంటర్-టైన్‌మెంట్ ప్యాకేజ్‌గా కనిపిస్తోంది. ఈ సినిమా 2025 దీపావళి సీజన్‌లో వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. మైత్రి మూవీ మేకర్స్ ఈ ద్విభాషా ప్రాజెక్ట్ కోసం యంగ్ అండ్ టాలెంటెడ్ టీమ్‌ను రంగంలోకి దింపింది. మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌లో రైజింగ్ స్టార్ సాయి అభ్యంకర్ లీడ్ చేస్తుండగా, సినిమాటోగ్రఫీని నికేత్ బొమ్మి హ్యాండిల్ చేస్తున్నాడు. ప్రొడక్షన్ డిజైన్‌ను లతా నాయుడు, ఎడిటింగ్‌ను బరత్ విక్రమన్ స్టీర్ చేస్తున్నారు, సినిమా విజువల్ వరల్డ్‌ను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లడానికిప్రస్తుతం షూటింగ్ ఫుల్ స్వింగ్‌లో జరుగుతోంది. దీపావళికి ఆడియన్స్‌కు కిక్కిచ్చే ఎంటర్-టైనర్ ఇవ్వడానికి టీమ్ ఫుల్ స్పీడ్‌లో వర్క్ చేస్తోంది. 'డ్యూడ్' తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ లాంగ్వేజెస్‌లో రిలీజ్ కానుంది.



### నాకు తెలియకుండానే

# హీరోను చేశారు

**టాకీస్:** తాను హీరో అని తనకే తెలియకుండా ఒక సినిమా చేసినట్లు వెన్నెల కిషోర్ చెప్పుకొచ్చాడు. అసలు విషయం ఏమిటంటే, వెన్నెల కిషోర్ కీలకపాత్రలో 'శ్రీకాకుళం షర్లాక్ హోమ్స్' అనే సినిమా రూపొందింది. ఈ సినిమాలో హీరో వెన్నెల కిషోర్ అని ముందు నుంచి సినిమా టీం చెబుతూ వచ్చింది. అంతేకాక, వెన్నెల కిషోర్ ప్రమోషన్స్‌కి ఎందుకు రాలేదు అంటే, అది ఆయన్ని అడగాలంటూ కామెంట్ చేయడం హాట్ టాపిక్ అయింది. ఈ విషయం మీద వెన్నెల కిషోర్ స్పందించాడు. నాకు నేను ఈ సినిమాలో హీరో అనే సంగతి తెలియదు. నాకు ముందుగా సినిమా కథ మొత్తం చెప్పలేదు. ఈ మధ్య నేను అలా అడగడం కూడా మానేశాను. ఎందుకంటే కొంతమంది కథ మొత్తం అడిగితే ఫీల్ అవుతున్నారు. కాబట్టి నా వరకు ట్రాక్ చెప్పమన్నాను, చెప్పారు. ఏడు రోజుల డేట్స్ ఇచ్చాను, షూట్ చేశాను. తర్వాత ఇంకొన్ని ఎమోషనల్ సీన్స్ యాడ్ చేయాలన్నారు. వెళ్లి నటించి వచ్చాను. సినిమా రిలీజ్ సమయంలో నేను హీరో అని పోస్టర్ వేస్తే ఆశ్చర్యపోయాను. అసలు నాకే తెలియకుండా నన్ను హీరోగా ఎలా చేశారో అర్థం కాలేదు. నాకు ముందు చెప్పినప్పుడు ఆ సినిమాలో వేరే హీరో ఉన్నాడు, అతనికి జంటగా అనన్య నాగాళ్ల నటిస్తుందని చెప్పారు. కానీ చివరికి నన్ను హీరోగా చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఇది నాకు తెలియకుండా జరిగింది. ముందే నాకు దర్శక నిర్మాతలు నేనే హీరోనని చెప్పి ఉంటే, అప్పుడు నేను ప్రమోషన్స్‌కి కూడా వచ్చి ఉండేవాడినేమో అంటూ ఆయన మాట్లాడారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.